అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు
ప్రచురించబడును.
సంప్రదించండి
93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం
తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక

అక్షరకలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ :
93962 18955

సంపుటి : 17 సంచిక : 266 | 07-11-2025 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00



## జూబ్లీహిల్స్‌లో ఎవరి

# ధీమా వారిది

- గెలిచి చేసేదేమీ లేదన్నది ప్రజలకూ తెలుసు
- గెలవడం కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లకే అవసరం
- ఓడినా గెలిచినా బిజెపికి వచ్చే నష్టం లేదు





జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం హోరాహోరీ పోరు సాగుతోంది. అతిరథ మహారథులంతా ప్రచారంలో దిగారు. కాంగ్రెస్ తరపున సిఎం రేవంత్, మంత్రులు గల్లీగల్లీ ప్రచారం చేస్తున్నారు. కార్నర్ మీటింగ్‌ల్తో సవాళ్లు విసురుతున్నారు. బిఆర్ఎస్ తరపున కెటిఆర్ ముందు వరసలో ఉన్నారు. అనేకమంది బిఆర్ఎస్ నేతలు ఉన్నా ఆయనే ముందుండి నడుపు తున్నారు. ఇక బిజెపి నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపిలు తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎవరికి వారు విమర్శలు, ప్రతి విమర్శలతో ఈ ఉప ఎన్నిక వేడెక్కింది. గెలిస్తే కాంగ్రె స్‌కు పరువు ఉంటుంది. తమ పథకా లకు ప్రజలు ఆమోదిస్తున్నారని, పాల నను మెచ్చుకుంటున్నారని చెప్ప కోవచ్చు. బిఆర్ఎస్ గెలిస్తే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసే అవకాశం మరింత పెరుగుతుంది.

వార్త 2లో



## బండి బోరబండ ప్రచారానికి అనుమతి నిరాకరణ

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా చేయనున్న ప్రచారంలో భాగంగా బోరబండలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీటింగ్‌కు పోలీసులు అనుమతి రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ మీటింగ్ గురువారం సాయంత్రం కొనసాగాల్సి ఉంది. తాజాగా ఆయన మీటింగ్ కు పర్మిషన్ ఇవ్వకపోవంతో పోలీసుల తీరుపై బీజేపీ శ్రేణుల మండిపడుతున్నాయి.

2 లో..

## జూబ్లీహిల్స్ అభివృద్ధిని విస్మరించిన

# ప్రభుత్వం

2 లో..

- ఇందులో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాత్రా ఉంది
- ప్రచారంలో గత హామీలపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్
- సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదే
- ముస్లింలు కాంగ్రెస్‌కు ఇజ్జత్ అయితే..మరి హిందువులో
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి

గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉప ఎన్నిక అంశంలో ఇంకా సర్వేలలో స్పష్టత లేదని చెప్పారు. సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో భారత రాష్ట్రసమితికి మూడో స్థానం వచ్చిందన్న ఆయన.. ఓటర్లలో ఏ పార్టీకి ఓటు వేయాలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు.





## డీస్పీలకు శిక్షణ కార్యక్రమం

ప్రారంభించిన డిజిపి శివధర్ రెడ్డి

వివరాలు 2 లో..

## రాజేంద్రనగర్‌లో

# విషాద ఘటన

### డ్రగ్స్ ఓవర్ డోస్‌తో వ్యక్తి మృతి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

డ్రగ్స్ భూతం యువతను పట్టిపీడిస్తోంది. ఎంతో భవిష్యత్తు ఉన్న అనేక మంది డ్రగ్స్ భూతానికి బలైపోతున్నారు. తమ బంగారు భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో తరచుగా డ్రగ్స్ పట్టుబడటం కూడా తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు అనేక ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏదో ఒక విధంగా సిటీలోకి డ్రగ్స్ ఎంటరవుతూనే ఉంది. తాజాగా డ్రగ్స్ తీసుకుని ఓ వ్యక్తి మరణించడం సంచలనంగా మారింది. డ్రగ్స్ ఓవర్ డోస్‌తో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మొబైల్ రిపేర్ బిజినెస్ చేస్తున్న అలీ డ్రగ్స్‌కు బానిసగా మారాడు. డ్రగ్స్ తీసుకోకుండా ఉండలేని పరిస్థితికి వచ్చాడు. ఈ క్రమంలో నిన్న ఒక అపార్ట్‌మెంట్‌లో అలీ డ్రగ్స్‌సేవించాడు. విషయం తెలిసిన వె ంటనే రాజేంద్రనగర్ పోలీసులు అ క్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



2 లో..

## తెలంగాణ కల్చర్ పుణ్యం కెటిఆర్‌దే: తుమ్మల

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. పలు ఫిర్యాదులు రావడంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఎపిలో ఇప్పటికే పెద్ద ఎత్తున సోదాలు సాగాయి. ఈ క్రమంలో నగరంలోని మూసాపేట్, కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో డాక్యుమెంట్స్ రైటర్స్ లేనిదే రిజిస్ట్రేషన్ పక్రియ జరగట్లదవే వరుస ఫిర్యాదుల నేపథ్యంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనీఖీలు నిర్వహించినట్టు తెలిపారు హైదరాబాద్ ఏసిబి డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి.. ప్రజల నుంచి వచ్చిన కంప్లైంట్ లకు బలం చేకూరే విధంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనీఖీలు చేసే సమయంలో 15మందికి పైగా డాక్యుమెంట్ రైటర్స్ ఆఫీస్ లోనే స్లాట్ బుకింగ్ కన్నా పదుల లంఖ్యలో ఎక్కువ డాక్యుమెంట్స్ తో ఉండడంపై అధికారులు దృష్టి పెట్టారు. ఒక డాక్యుమెంట్ రైటర్ వద్ద దొరికిన 10వేల రుపాయలు ఎక్కడి నుంచి వచ్చాయో అన్నకోణంలో దర్యాప్తు చేసు న్నామని ,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యు మెంట్ రైటర్స్ ఉండడంపై జిల్లా ఉన్నతాధికారులకు పిర్యాదు చేస్తామన్నారు.



## జూబ్లీహిల్స్‌లో గెలుపే

# లక్ష్యంగా సాగాలి

- చిన్న ఏమరుపాటు కూడా పనికి రాదు
- ఈ మూడు రోజులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి
- ప్రతి ఓటరును కలిసి మన వాయిస్ వినిపించాలి
- బిఆర్ఎస్ దుష్ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి
- మంత్రులు, పార్టీ నేతలకు సిఎం దిశానిర్దేశం

వివరాలు 2 లో..

## నేటి కేబినేట్ భేటీ

# వాయిదా

### 12న జరపాలని నిర్ణయం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

నేడు జరగాల్సిన తెలంగాణ కేబినెట్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 12వ తేదీన తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మంత్రులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. హైకోర్టు తీర్పు కారణంగా వాయిదా పడిన స్థానిక ఎన్నికలపై చివరిసారిగా జరిగిన కేబినెట్‌లోనూ క్లారిటీ రాలేదు. నవంబర్ 7న జరిగే మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ శుక్రవారం జరగాల్సిన కేబినెట్ సమావేశాన్ని ఈ నెల 12వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అమల్లో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తున్నట్టు గత కేబినెట్ సమావేశం సందర్భంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 21(3)ని తొలగించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.



# బండి బోరబండ ప్రచారానికి అనుమతి నిరాకరణ

## పోలీసుల తీరుపై మండిపడ్డ బిజెపి శ్రేణులు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా చేయనున్న ప్రచారంలో భాగంగా బోరబండలో బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ మీటింగ్‌కు పోలీసులు అనుమతి రద్దు చేశారు. షెడ్యూల్ ప్రకారం బండి సంజయ్ మీటింగ్ గురువారం సాయంత్రం కొనసాగాల్సి ఉంది. తాజాగా ఆయన మీటింగ్ కు పర్మిషన్ ఇవ్వకపోవంతో పోలీసుల తీరుపై బీజేపీ శ్రేణుల మండిపడుతున్నాయి. కాంగ్రెస్ తమపై కుట్రలు చేస్తోందని, కనీసం ప్రచారం చేసుకోనివ్వకుండా ఇలా పర్మిషన్ కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అయితే తమ సభకు అనుమతి ఇచ్చి రద్దు చేయడమేంటని బీజేపీ ఎన్నికల ఇంఛార్జ్ ధర్మారావు ప్రశ్నించారు. కచ్చితంగా సాయంత్రం బోరబండలోనే మీటింగ్ జరిపి తీరుతామని స్పష్టం చేశారు. బీజేపీ శ్రేణులంతా భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. బండి సంజయ్ సభకు ఆటంకాలు లేకుండా సహకరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని వెల్లడించారు.

# డీస్పీలకు శిక్షణ కార్యక్రమం

## ప్రారంభించిన డిజిపి శివధర్ రెడ్డి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

గ్రూప్ 1లో ఎంపికైన 115 మంది డీఎస్పీలకు ట్రైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది. గురువారం ఉదయం డీజీపీ శివధర్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీజీపీఏకు చేరుకున్న డీజీపీకి టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్ గౌరవ వందనంతో స్వాగతం పలికారు. రాజేంద్రనగర్‌లోని టీజీపీఏలో ప్రొబేషనరీ డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)లకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. 115 మందితో ఇదే అతిపెద్ద డీఎస్పీ బ్యాచ్ అని అన్నారు. ఈ 10 నెలలు చాలా కష్టంగా ఉంటుందని.. అన్నింటినీ ఎదుర్కొని సమర్థవంతంగా నిలుస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ప్రజల హృదయాలు గెలవగలగాలని నిర్దేశించారు. కొత్తగా రిక్రెట్ అయిన మహిళా డీఎస్పీలు వచ్చే తరానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ట్రైనింగ్‌లో స్నేహపూర్వకం గా ఉంటూ.. ఒకరికి ఒకరు తోడ్పాటు అందించుకోవాలని సూచించారు. ఇంటెగ్రిటీ, ఎంపథీ, ప్రొఫెషనల్ ఎక్సలెన్స్.. ఈ మూడు ముఖ్యంగా గుర్తించుకోవాలని అన్నారు. ఈ వంద మంది ట్రైనింగ్‌లోనే కాదు.. బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా కాంటాక్ట్‌లో ఉండాలని తెలిపారు. పోలీసింగ్‌కు నెట్వర్క్ చాలా ముఖ్యమని ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ కల్చర్ పుణ్యం కెటిఆర్‌దే: తుమ్మల

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

సీఎం రేవంత్ రెడ్డి పెట్టే ఇబ్బందుల కారణంగానే పారిశ్రామిక వేత్తలు తెలంగాణ వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు తెలంగాణలో డ్రగ్, గన్ కల్చర్ తెచ్చిందే కేటీఆర్ అని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలు తెలంగాణ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని కేటీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గురువారం (నవంబర్ 6) జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో పాల్గొన్న మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఓట్ల కోసం ఇచ్చిన వాగ్దానాలు, లక్షలాది కోట్ల బాకీల సంగతి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత ఇబ్బంది కరంగా ఉన్నప్పటికీ గడిచిన 20 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్న తుమ్మల.. పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు రోజుకొకరు తెలంగాణకు వస్తున్నట్లు చెప్పారు.

# ఎపిలో మెడికల్ విద్య ప్రైవేటీకరణ

## 12న పెద్ద ఎత్తున ఆందోళనలు,ర్యాలీలు చేపడతాం

## చంద్రబాబు ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగన్

అమరావతి, అక్షరకలం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌లో మెడికల్ విద్యారంగంపై సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం దరిద్రపు పని అని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ మాట్లాడుతూ.. మూడేళ్లలో మేము 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించాం. ప్రతి జిల్లాలో గవర్నమెంట్ కాలేజీలు ఏర్పరిచాం. కానీ చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకురాలేదు. ఇప్పుడు వాటిని ప్రైవేట్ వారికి అప్పగించాలనే ప్రయత్నం చేస్తున్నారు. సంవత్సరానికి వెయ్యి కోట్లు ఖర్చు చేసి అయినా ప్రజల ఆరోగ్య భవిష్యత్తును కాపాడాలని అన్నారు. చంద్రబాబు మంచి చేయకపోగా, చెడు చేస్తున్నారని విమర్శించిన ఆయన, విద్యార్థులు దీనిపై ప్రశ్నించాల్సిన బాధ్యత ఉందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న ర్యాలీలు నిర్వహిస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై డిసెంబర్‌లో ఆందోళనలు చేపడతాం. అంతవరకు చంద్రబాబుకు సమయం ఇస్తున్నామని జగన్ చెప్పారు. అంతేకాకుండా.. 'మా వైసీపీ ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసింది. విద్యా దీవెన కింద రూ.12,609 కోట్లు ఇచ్చాం. వసతి దీవెన కింద ప్రతి విద్యార్థికి రూ.20 వేల చొప్పున అందించాం. పేద కుటుంబాలు అప్పుల పాలు కాకుండా చూశాం అని గుర్తుచేశారు. పేదలకు చదువు భారం కాకూడదు. కానీ ఈ ప్రభుత్వం అన్నింటినీ ధ్వంసం చేస్తోంది. పిల్లలు చదవకూడదనే ఉద్దేశంతో చంద్రబాబు పనిచేస్తున్నారు. రూ.4,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.2,200 కోట్ల వసతి దీవెన పెండింగ్‌లో ఉంచారు. మా హయాంలో ప్రభుత్వ రంగంలోనే 6.3 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.2 లక్షల మందికి ఉపాధి కల్పించాం, అని మాజీ సీఎం వైఎస్ జగన్ అన్నారు.

# భూ వివాదంలో డమ్మీ తుపాకితో కాల్పులు

## విచారణ చేపట్టిన పోలీసులు

మెదక ఇద్దరి మధ్య నెలకొన్న భూవివాదం.. ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. పంట కోసేందుకు సిద్ధమైన రైతును అడ్డుకునేందుకు ప్రత్యర్థి డమ్మీ తుపాకీతో బెదిరింపులకు గురి చేశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా పరిధిలోని హవేలిఘన్‌పూర్ గ్రామ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది.

ఎల్లం అనే రైతు తన వరి పంటను కోసేందుకు సిద్ధమయ్యాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన హరినాథ్ అనే వ్యక్తి తన అనుచరులతో ఆ పొలం వద్దకు చేరుకున్నాడు. పంట కోసేందుకు వీల్లేదని, ఈ భూమి తనదని డమ్మీ తుపాకీతో ఎల్లంను బెదిరించాడు. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఎల్లం పోలీసులకు సమాచారం అందించాడు. పొలం వద్దకు చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. హరినాథ్ వద్ద ఉన్న డమ్మీ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూవివాదం కోర్టులో ఉందని, వరి పంటను కోసేందుకు ఎల్లం కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# జూబ్లీహిల్స్‌లో ఎవరి ధీమా వారిది

## గెలిచి చేసేదేమీ లేదన్నది ప్రజలకూ తెలుసు

## గెలవడం కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకే అవసరం

## ఓడినా గెలిచినా బిజెపికి వచ్చే నష్టం లేదు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం హోరాహోరీ పోరు సాగుతోంది. అతిరథ మహారథులంతా ప్రచారంలో దిగారు. కాంగ్రెస్ తరఫున సిఎం రేవంత్, మంత్రులు గల్లీగల్లీ ప్రచారం చేస్తున్నారు. కార్నర్ మీటింగ్‌ల్లో సవాళ్లు విసురుతున్నారు. బిఆర్ఎస్ తరఫున కెటిఆర్ ముందు వరసలో ఉన్నారు. అనేకమంది బిఆర్ఎస్ నేతలు ఉన్నా ఆయనే ముందుండి నడుపుతున్నారు. ఇక బిజెపి నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపిలు తదితరులు ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎవరికి వారు విమర్శలు, ప్రతి విమర్శలతో ఈ ఉప ఎన్నిక వేడెక్కింది. గెలిస్తే కాంగ్రెస్‌కు పరువు ఉంటుంది. తమ పథకాలకు ప్రజలు ఆమోదిస్తున్నారని, పాలనను మెచ్చుకుంటున్నారని చెప్పుకోవచ్చు. బిఆర్ఎస్ గెలిస్తే ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసే అవకాశం మరింత పెరుగుతుంది. ఎంతమంది వచ్చినా ప్రజలు తమ వెన్నంటే ఉన్నారని చెప్పుకోవచ్చు. ఇక బిజెపి గెలిస్తే నరేంద్రమోడీ ఛరిష్మా అని ప్రచారం చేసుకుంటారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని అంటారు. ఎన్నికల తరవాత ఇవే ప్రకటనలు కొంచెం అటుఇటుగా ఉంటాయి. పదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ఓటరు మహాశయుడు మరిచిపోలేదు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో జరిగిన




దురాగాతాలను కూడా గమనిస్తూనే ఉన్నాడు. ఇక, సమయం వచ్చింది. రేవంత్ బుల్డోజర్ పాలనకు తమ సిరా చుక్కతో బుద్ధి చెప్పాలని జూబ్లీహిల్స్ ఓటర్లను బిఆర్ఎస్ కోరుతోంది. మరో నాలుగు రోజుల్లో జరుగనున్న ఉప ఎన్నికలో హస్తం పార్టీ 30వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తుందని సిఎం రేవంత్ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలా పిలిచే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హ్యాట్రిక్ విజయాలు సాధించారు. దురదృష్టవశాత్తు ఆయన అనారోగ్యంతో మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఆసక్తి రేకెత్తిస్తున్నది. ఇక మైనార్టీలు ఎక్కువగా ఉన్న జూబ్లీహిల్స్‌లో ఆ వర్గం ఓటర్లను ఆకట్టుకోవడానికి అజారుద్దీన్‌కుఅ త్యవసరంగా మంత్రి పదవి కట్టబెట్టారు. దీంతో వారి మద్దతు కొంత కాంగ్రెస్ సాధించిందనే చెప్పాలి. ఎంఐఎం కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడం కలిసివచ్చే అంశం. ఓటర్లు ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా ఓటేసే అవకాశాలు ఉన్నాయని బిజెపి, బిఆర్ఎస్ ఆశగా ఉన్నాయి. ఇదే సందర్భంలో బిఆర్ఎస్ సొంత సర్వేలతో హడలెత్తించే ప్రయత్నంలో ఉంది. ప్రతి సర్వేలోనూ కారు దూసుకుపోయినట్టు ఉందని చెబుతోంది. . జూబ్లీహిల్స్ ఓటర్లలో 48 శాతం మంది కేసీఆర్ పార్టీకి మద్దతు ప్రకటించగా.. కాంగ్రెస్‌కు 42శాతం, బీజేపీకి 9శాతం మంది ఓటేస్తారని ముందే చెప్పుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురనున్నట్టు సర్వే తేల్చిందని ప్రచారం చేసుకుంటున్నారు. రేవంత్ పాలనలో పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి బాగుందా?, కేసీఆర్ పాలనలో పరిపాలన, సంక్షేమం, అభివృద్ధి బాగుందా? అనే ప్రశ్న ఇప్పుడు ఇక్కడ ఉత్పన్నం కానేకాదు. ఎందుకంటే ఇక్కడ ప్రభుత్వ అజమాయిషీయే ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీకి మాత్రమే ఉప ఎన్నికల్లో అనుకూలత ఉంటుంది. కాబట్టి కొంత అటుఇటుగా మాత్రమే మెజార్టీ ఉన్నా గెలుపు అవకాశాలు ఎక్కువగా అధికార పార్టీకి ఉంటుంది. ఇకపోతే ఇక్కడ ఎవరు గెలిచినా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. ఇది ప్రజలకు కూడా బాగా తెలుసు.

# జూబ్లీహిల్స్ అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం

## ఇందులో గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాత్రా ఉంది

## ప్రచారంలో గత హామీలపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్

## సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదే

## ముస్లింలు కాంగ్రెస్‌కు ఇజ్జత్ అయితే..మరి హిందువులో

## మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కిషన్ రెడ్డి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఉప ఎన్నిక అంశంలో ఇంకా సర్వేలలో స్పష్టత లేదని చెప్పారు. సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో భారత రాష్ట్రసమితికి మూడో స్థానం వచ్చిందన్న ఆయన.. ఓటర్లలో ఏ పార్టీకి ఓటు వేయాలో ఇంకా స్పష్టత లేదని చెప్పారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం లో 6 గ్యారంటీలను గానీ, 400 పైచిలుకు హామీల గురించి గానీ ఎక్కడా ప్రస్తావించడం లేదని, వ్యక్తిగత విమర్శలు చేయడంపైనే దృష్టి పెడుతోందని దుయ్యబట్టారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామస్థాయిలో ఉండే అభివృద్ధి కూడా జూబ్లీహిల్స్‌లో లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఏ పార్టీకి ఓటు వేయాలనే దానిపై ఓటర్లు ఇంకా నిర్ణయానికి రాలేదని.. అందుకే సర్వేల్లో కూడా స్పష్టత లేదని కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ వెనుకబాటుకు గతంలో పాలించిన బిఆర్ఎస్ కూడా బాధ్యత వహించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, గ్యారెంటీలపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సన్నబియ్యంలో మెజార్టీ వాటా కేంద్రానిదేనని కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దీనికి సంబంధించి ఒక పోస్ట్ ను కూడా కిషన్ రెడ్డి తన సోషల్ మీడియా అకౌంట్లో పెట్టారు. 'ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి 'ఇజ్జత్' అంటావు, మరి హిందువులు ఇజ్జత్ కాదా మిస్టర్ రేవంత్ రెడ్డి? మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులకు గౌరవం లేదా? ఎర్రగడ్డలో ఖబరస్థాన్ కోసం స్థలం ఇచ్చేందుకు మనసొచ్చింది కానీ, బంజారాహిల్స్‌లో పెద్దమ్మ తల్లి గుడికి 50 గజాలు స్థలం ఇవ్వడం ఎందుకు కుదరలేదు. హిందువులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవు. ఎన్నాళ్లు మజ్లిస్‌ను భుజాన ఎక్కించుకొని తిరుగుతావో తిరుగు. ప్రజలే నీకు గట్టి బుద్ధి చెబుతారని అంటూ కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఓటు వేయక పోతే సన్న బియ్యం, ఫ్రీ బస్ ఆగిపోతుంది అని సీఎం అన్నారు.. సన్నబియ్యం లో కేంద్ర ప్రభుత్వానిదే సింహభాగం.. ఏ విధంగా సీఎం ఆపుతారో చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సకల సమస్యలకు పరిష్కారం ఫ్రీ బస్సు అనే విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చిన నిధులను, వచ్చిన సంస్థల వివరాలు కిషన్‌రెడ్డి వివరించారు. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో బీబీనగర్ ఎయిమ్స్ భవనాలు ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభమవుతాయని వెల్లడించారు. 2 వందల బస్తీ దవాఖానలు కేంద్రం సహకారంతో నడుస్తున్నాయి. కేసీఆర్ పేరు మార్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి 101 అభివృద్ధి కార్యక్రమాలు హైద్రాబాద్ పరిధిలో జరుగుతున్నాయన్నారు. రేవంత్ రెడ్డి స్థాయికు దిగజారి నేను అడ్డుకుంటున్నాను అని మాట్లాడుతున్నారు. మెట్రో గురించి కూడా మాట్లాడుతున్నారు.. ఎల్ అండ్ టి మేము చేయలేము అంటుంది? ఆ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాలి? కొత్త డిపిఆర్ కేంద్రానికి ఇవ్వాల్సి ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'తెలంగాణ బిడ్డగా నా నియోజక వర్గం అభివృద్ధి కోరుకుంటా.. బాధ్యత రహితంగా మాట్లాడుతున్నారు రేవంత్ రెడ్డి.. తెలంగాణ కోసం మా కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించాను.. వివిధ అంశాల పై కేసీఆర్‌కు 40 లెటర్లు రాశాను.. స్పందించలేదు.. అలాంటి వాళ్లు కూడా విమర్శలు చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు.. హైద్రాబాద్ లో డిఫెన్స్ మీద లక్ష 40 వేల కోట్లు ఖర్చు పెట్టింది కేంద్రం.. అని వెల్లడించారు. పత్తి రైతులు ఆందోళన చెందొద్దు? మార్చి వరకు పత్తి కొంటాం.. కాంగ్రెస్ పార్టీ వి కూడా చాలా సార్లు డిపాజిట్ రాలేదు.. జూబ్లీహిల్స్ నాకు తెలుసు? అక్కడి ప్రజలు ఓటు వేసేది.. కౌంటింగ్ రోజు తెలుస్తుంది ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయి.. రేవంత్ రెడ్డి మాటలను సిరియస్ గా తీసుకోవాల్సిన అవసరం లేదు.. ఆయన మాట్లాడుతూ పోతుంటారు మనం వింటూ పోవాలి.. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్ట్ మీద సిబిఐ దర్యాప్తు జరపాలి అని మేము అడుగుతున్నాం.. హై కోర్టులో కేసు నడుస్తుంది.. నేను కూడా ఢిల్లితో మాట్లాడతా.. ఢిల్లి స్థాయిలో ఒప్పందం కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు జరిగింది. రేవంత్‌ను సీఎంగా కొనసాగించాలని రాహుల్‌కు ఇష్టం లేదని కేటీఆర్ అంటున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా సాగాలి

## చిన్న ఏమరుపాటు కూడా పనికి రాదు

## ఈ మూడు రోజులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి

## ప్రతి ఓటరును కలిసి మన వాయిస్ వినిపించాలి

## బిఆర్ఎస్ దుష్ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి

## మంత్రులు, పార్టీ నేతలకు సిఎం దిశానిర్దేశం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు. ఇక్కడ ఖచ్చితంగా గెలవబోతున్నామని, అందువల్ల మెర్జీ కోసం కృషి చేయాలన్నారు. అలాగే ఓటింగ్ శాతం పెరిగేలా ప్రతి ఒక్కరూ బూత్‌కు వచ్చి ఓటేసేలా చూసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతోపాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో.. క్షేత్ర స్థాయి పరిస్థితులు, సర్వే నివేదికలు, పార్టీ నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమాలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలు, వ్యూహ, ప్రతి వ్యూహాలు తదితర అంశాలపై సమీక్ష చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మంత్రులందరికి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి....ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని దిశానిర్దేశంచేసినట్లు తెలుస్తోంది.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలువబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి మంత్రులకు సూచించారు. మంత్రులు, పార్టీ నాయకులు అందరూ మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారానికి గట్టిగా కౌంటర్ ఇవ్వాలని సూచించారు. మంత్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోజుకో సర్వేను వదులుతూ ప్రజలను, ఓటర్లను బీఆర్ఎస్ సోషల్ మీడియా గందరగోళానికి గురి చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఫీల్డ్ లో కాంగ్రెస్ కు బలం ఉందని, నవీన్ యాదవ్ మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని గ్రౌండ్ రిపోర్టులు చెబుతున్నాయని అన్నారు. ప్రచారానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉందని, ప్రతి గంటనూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతి ఓటరుకు మన వాయిస్ చేరాలని అన్నారు. మనం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు చేర్చే బాధ్యతను మంత్రులు, పార్టీ నాయకులు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజుల్లో పోల్ మేనేజ్మెంట్ పై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటి వరకు సాగిన ప్రచారంపై రివ్యూ చేశారు. ఈ సెగ్మెంట్ లో పోలింగ్ పర్సంటేజీ పెంచడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం ఈ రివ్యూలో సూచించినట్టు సమాచారం. ఇక్కడ మొత్తం 4,01,365 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,08,561మంది, మహిళలు 1,92,779 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. వీళ్లంతా 139 పోలింగ్ కేంద్రాల్లోని 407 పోలింగ్ బూత్ లలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ చాలా తక్కువగా పోలింగ్ శాతం నమోదవుతోంది.ఇక్కడ 2009 లో 52.76శాతం , 2014లో 50.18, 2018లో 45.59 2023లో 47.49 శాతం పోలింగ్ నమోదవుతోంది. దానిని పెంచడం, ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రం వరకూ వచ్చేలా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సీఎం చెప్పినట్టు సమాచారం. దీంతో పాటు బస్తీల వారీగా పరిస్థితిని కూడా సీఎం సమీక్షించినట్టు తెలుస్తోంది.




# మమ్దానీ విజయం జీర్ణించుకోలేక పోతున్న ట్రంప్

## ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుందని హెచ్చరిక

**న్యూయార్క్,**

న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ విజయం సాధించడాన్ని అధ్యక్షుడు ట్రంప్ జీర్ణించుకోలేక పోతున్నారు. ఎందుకంటే మమ్దానీ ఓటమికి శయశక్తుల కృషి చేశారు. న్యూయార్క్ నగరం కమ్యూనిస్ట్ క్యూబా, సోషలిస్ట్ వెనెజువెలా వలే మారుతుందని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారు. 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను సవాల్ చేసి మరీ విజయం సాధించాడు. విజయం అనంతరం మమ్దానీ చేసిన ప్రసంగం ఆవేశపూరితంగా ఉందని, ఈ కొత్త మేయర్ కమ్యూనిస్ట్ భావజాలం కలిగిన వ్యక్తి అని విమర్శించారు. ఈ నగర ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2024, నవంబర్ 5న ఏర్పడిన తన ప్రభుత్వం పునరుద్ధరించిందని చెప్పారు. ఇప్పుడు న్యూయార్క్‌లో ఆ సార్వభౌమత్వాన్ని కొద్దిమేర కోల్పోయామని అన్నారు. అయితే తాము దానిని జాగ్రత్తగా చూసుకుంటామని చెప్పారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి నగరంలో నిర్వహించిన అమెరికా బిజినెస్ ఫోరంలో ట్రంప్ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సవాలు చేసి మరీ 34 ఏళ్ల భారత సంతతి యువకుడు జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా విజయం సాధించారు. దీనిపై ట్రంప్ స్పందించారు.




విజయం అనంతరం మమ్దానీ ఇచ్చిన ప్రసంగం ఆవేశపూరితంగా ఉందని వ్యాఖ్యానించారు. నవంబర్ 5, 2024న ఏర్పడిన ప్రభుత్వం సార్వభౌమత్వాన్ని పునరుద్ధరించిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అయితే ముందురోజు రాత్రి న్యూయార్క్‌లో ఆ సార్వభౌమత్వాన్ని కొద్దిమేర కోల్పోయాం. అయితే మేం దానిని జాగ్రత్తగా చూసుకుంటాం అని ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి నగరంలో అమెరికా బిజినెస్ ఫోరంలో ట్రంప్ మాట్లాడారు. ఇదిలాఉంటే.. మమ్దానీ విజయంలో అత్యంత కీలకమైన హామీ ఉచిత సిటీబస్సు ప్రయాణాలు. దీంతోపాటు నగరంలో అద్దెలను స్థిరీకరిస్తానని, యూనివర్సల్ ఛైల్డ్ స్కీమ్ అమలు, 2030 నాటికి కనీస వేతనాల పెంపు, కార్పొరేట్లు, సంపన్నులపై పన్ను పెంచి చిరుజీవుల జీవన వ్యయాలను తగ్గిస్తానని ప్రచారంలో పేర్కొని ఓటర్లను ఆకర్షించిన సంగతి తెలిసిందే. డెమోక్రాట్లు అమెరికాకు ఏం చేయాలని అనుకుంటున్నారో మీరు చూడాలనుకుంటే.. న్యూయార్క్ ఎన్నికల ఫలితాన్ని గమనించండి. అక్కడ ఆ పార్టీ కమ్యూనిస్ట్‌ను మేయర్‌గా ఎంచుకుంది. ఇక్కడి కమ్యూనిజం ప్రభావంతో పారిపోయే వారికి మయామి ఒక ఆశ్రయ స్థానంగా మారనుందని వ్యాఖ్యలు చేశారు. కాగా.. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ట్రంప్‌నకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఆయన పార్టీకి చెందిన అభ్యర్థులను పలు రాష్ట్రాల ప్రజలు తిరస్కరించారు. ఇటీవల వర్జీనియా, న్యూజెర్సీల్లో నిర్వహించిన పోల్‌లోనూ దేశంలో నెలకొన్న తాజా పరిణామాలపై ప్రతి 10 మందిలో ఆరుగురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తేలింది. కేవలం మూడులో ఒకవంతు మాత్రమే ప్రస్తుత పాలనపై సంతృప్తిగా ఉన్నామని చెప్పారు. ఈ ఎన్నికల ఫలితాలపై 'బిగ్ బ్యూటిఫుల్' బ్జడెట్ బిల్లు సహా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు వంటి ట్రంప్ ప్రభుత్వ విధానాలు ప్రభావం చూపాయనే వాదన వినిపిస్తోంది.

# 38వరోజుకు చేరుకున్న అమెరికా షట్‌డౌన్

## సంక్షోభంలో లక్షలాది అమెరికలన్ జీవితాలు

## 40 విమానాశ్రయాల్లో 10 శాతం విమానాల రద్దు

**వాషింగ్టన్,**

:అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ నేటితో 38వ రోజుకు చేరుకుంది. దేశ చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగుతున్న షట్‌డౌన్‌గా ఇది చరిత్ర సృష్టించింది. ఈ షట్‌డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఈ షట్‌డౌన్ దేశంలోని పలు విమానాశ్రయాలపై తీవ్ర ప్రభావం పడిన విషయం తెలిసిందే. షట్‌డౌన్ సమయంలో ఎలాంటి జీతం లేకుండా పనిచేస్తున్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, టీఎస్ఏ సిబ్బంది అనారోగ్య కారణాలతో విధులకు గైర్హాజర్ కావడంతో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలలో విమానాల రాకపోకలు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. విమాన సేవల్లో కోత విధించేందుకు సిద్ధమైంది. రద్దీ అత్యధికంగా ఉన్న 40 విమానాశ్రయాల్లో




10 శాతం విమానాలను రద్దు చేయనుంది. ఈ మేరకు ఆ దేశ రవాణా శాఖ మంత్రి సీన్ డఫీ ప్రకటించారు. ఈ మార్పులు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. పరిమిత సంఖ్యలో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌పై ఒత్తిడి తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పరిస్థితి మరింత దిగజారితే అదనపు ఆంక్షలు ఉంటాయని మంత్రి వెల్లడించారు. సేనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు ఆమోదం దక్కక పోవడంతో అక్టోబర్ 1న అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ షట్‌డౌన్ నేటితో 38వ రోజుకు చేరుకుంది. దేశ చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగుతున్న షట్‌డౌన్‌గా ఇది చరిత్ర సృష్టించింది. ఈ షట్‌డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఆహార సహాయంతోపాటు సామాన్య ప్రజల నిత్య జీవితంలోని కీలక అంశాలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులు కోతపడగా విమాన ప్రయాణాలలో ఆలస్యాలు, జీతం లేకుండా వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తుండడంతో ప్రజల జీవితాలపై ఈ షట్‌డౌన్ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇప్పటికీ ఇది ముగిసే అవకాశాలు కనిపించడం లేదు. ఈ షట్‌డౌన్ కారణంగా అగ్రరాజ్యంలో ఆర్థిక సంక్షోభం తలెత్తింది. అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 7 బిలియన్ డాలర్లకుపైనే అంటే రూ. 62,195 కోట్లు నష్టం వాటిల్లింది. షట్‌డౌన్ ఎత్తివేసి పూర్వ పరిస్థితులు ఏర్పడినా అది తిరిగి పొందలేని నష్టమని నిష్పక్షపాతంగా పనిచేసే కాంగ్రెస్ బ్జడెట్ ఆఫీస్ కొత్త నివేదిక తెలిపింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలానికి మరింత నష్టం ఏర్పడుతుందని పేర్కొంది. ఆహార సహాయంతోపాటు సామాన్య ప్రజల నిత్య జీవితంలోని కీలక అంశాలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులు కోతపడగా విమాన ప్రయాణాలలో ఆలస్యాలు, జీతం లేకుండా వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తుండడంతో ప్రజల జీవితాలపై ఈ షట్‌డౌన్ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇప్పటికీ ఇది ముగిసే అవకాశాలు కనిపించడం లేదు. సెప్టెంబర్ 30 తర్వాత ప్రభుత్వ బడ్జెట్‌కు అమెరికన్ పార్లమెంట్ ఆమోదం తెలియచేయకపోవడంతో ప్రభుత్వ వ్యవస్థలన్నీ స్తంభించిపోయాయి. సంక్షేమ కార్యక్రమాలకు తీవ్ర నిధుల కొరత ఏర్పడింది.

# అఫ్ఘాన్‌తో చర్చలకు ముందే పాక్ బెదిరింపులు

## చర్చలు ఫలించకుంటే యుద్ధం తప్పదన్న ఖవాజా ఆసిఫ్

**ఇస్లామాబాద్,**

ఉద్రిక్తతలను పరిష్కరించుకునేందుకు గురువారం పాకిస్థాన్- అఫ్గానిస్థాన్ దేశాల మధ్య కీలకమైన శాంతి చర్చలు ప్రారంభం కానున్ననేపథ్యంలో చర్చల ప్రారంభానికి ముందే పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేటి చర్చలు ఫలించకపోతే తాలిబన్ల తో యుద్ధానికి వెళ్లాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. శాంతిచర్చలు విఫలమైతే ఇరుదేశాల మధ్య పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతాయన్నారు. 'మా వద్ద చాలా ఆప్షన్లు ఉన్నాయి. శత్రువులు మమ్మల్ని ఎలా టా÷-గ్గ÷ట్ చేస్తారన్న దాన్ని బట్టి మా ప్రతిస్పందన కూడా తీవ్రస్థాయిలో ఉంటుంది. చర్చలు ఫలించకపోతే యుద్ధం జరిగి తీరుతుంది' అని ఖవాజా వ్యాఖ్యానించారు. మిలిటెంట్లకు



కాబూల్ ఆశ్రయం కల్పిస్తోందని, సీమాంతర దాడులను ప్రోత్సహిస్తోందని పాక్ మంత్రి దుయ్యబట్టారు. అయితే ఖవాజా వ్యాఖ్యలను అఫ్గాన్ తీవ్రంగా ఖండించింది. సామాన్యులను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ డ్రోన్ దాడులకు పాల్పడుతోందని మండిపడింది. కాగా టర్కీలోని ఇస్తాంబుల్ వేదికగా అఫ్గాన్-పాక్ మధ్య మూడోవిడత శాంతి చర్చలు జరగనున్నాయి. దీనికి ఖతార్, టర్కీ మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. అంతకుముందు దోహా, ఇస్తాంబుల్‌లో రెండు విడతల్లో జరిగిన శాంతి చర్చల్లో ఎలాంటి ఒప్పందాలు జరగలేదు. అఎ÷-గాన్ భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు.. పాక్ ఖైబర్ పఖ్తుంఖ్వాలోని ఓరక్‌జాయ్ జిల్లాలో ఇటీవల దాడులు చేశారు. ఈ దాడుల్లో లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ సహా 11 మంది సైనికులు మరణించారు. ఈ నేపథ్యంలోనే అఫ్గాన్ రాజధాని కాబుల్‌లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ పేలుళ్లకు పాకిస్థాన్ కారణమని తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ క్రమంలోనే తాలిబన్ సైన్యం పాకిస్థాన్‌పై దాడులకు దిగింది. దాంతో పాకిస్థాన్ ఎదురుదాడులు జరిపింది. ఈ ఘర్షణల్లో ఇరువైపులా భారీ ప్రాణనష్టం జరిగింది. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.

# నాకే ఈ పరిస్థితి ఎదురయితే..

## సామాన్యుల గతేం కాను: మెక్సికో అధ్యక్షురాలు

**న్యూఢిల్లీ,**

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా సీన్‌బామ్ నడిరోడ్డుపై లైంగిక వేధింపులకు గురైన విషయం తెలిసిందే. మిచొకాన్‌లో ప్రజలతో మాట్లాడుతుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి బహిరంగంగా తాకుతూ ఆమెను ముద్దుపెట్టుకోవడానికి ప్రయత్నించాడు. దేశ అధ్యక్షురాలు నడిరోడ్డుపై లైంగిక వేధింపులు ఎదుర్కోవడం కలకలం సృష్టించింది. ఈ ఘటనపై క్లాడియా తాజాగా స్పందించారు. ఈ మేరకు తనపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు పెట్టారు. ఈ ఘటన మెక్సికోలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులను ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. 'పురుషాధిక్యత, లైంగిక వేధింపులతో దేశంలోని మహిళలు ఇప్పటికీ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈరోజు దేశ అధ్యక్షురాలైన నాకే ఇలా జరిగితే.. మన దేశంలోని యువతుల పరిస్థితి ఏంటి..? మహిళల వ్యక్తిత్వాన్ని దుర్వినియోగం చేసే హక్కు ఏ వ్యక్తికీ లేదు' అని క్లాడియా పేర్కొన్నారు.

# జిల్లాల పునర్ వ్యవస్థీకరణ

## మరోమారు కేబినేట్ కమిటీ భేటీ

## చంద్రబాబుకు తుది నివేదిక అందించే యత్నం

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో సచివాలయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల బృందం బుధవారం సమావేశమైంది. ఈ భేటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత పాల్గొన్నారు. వర్చువల్‌గా మంత్రి నారాయణ, సత్య కుమార్ యాదవ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై



మంత్రులు మాట్లాడారు. జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు జీవోఎం ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే జీఎంవో ప్రాథమికంగా ఇచ్చిన నివేదికపై కొన్ని మార్గదర్శకాలు సీఎం చంద్రబాబు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని ఇప్పటికే జీఎంవో నిర్ణయించింది. మంత్రుల బృందం సమావేశంలో చర్చించిన అంవాలతో తుది నివేదికను రూపొందించి సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉప సంఘం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే నివేదిక ఇచ్చేందుకు జీవోఎం ప్రయత్నిస్తోంది. ఈ నెల 10వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కీలక చర్చలు జరిపి మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి.

# దుబాయ్‌లో కొనసాగుతున్న నారాయణ పర్యటన

## పెట్టుబడులు లక్ష్యంగా

## పలు సంస్థలతో భేటీ

**అమరావతి,**

ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు విదేశాల్లో పర్యటిస్తున్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలను కలుస్తూ పెట్టుబడులకు ఏపీ అనువైన ప్రాంతమని చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం సీఎం చంద్రబాబు దుబాయ్‌లో, మంత్రి లోకేష్ ఆస్ట్రేలియాలో పర్యటించి ఇన్వెస్ట్‌మెంట్స్‌పై ఫోకస్ పెట్టారు. ఇప్పుడు తాజాగా మంత్రి నారాయణ బృందం దుబాయ్‌లో పర్యటిస్తోంది. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం మూడు రోజులుగా దుబాయ్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన కొనసాగుతోంది. ఈరోజు (బుధవారం) బీఆ ఫెసిలిటీ, టెక్టాన్ ఇంజనీరింగ్, అరబ్ – ఇండియా స్పైసెస్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశంకానున్నారు. వేస్ట్ మేనేజ్మెంట్, రికవరీ ఎ÷-లాంట్‌లు, వైద్య రంగంలో ఫెసిలిటీ సంస్థ ప్రపంచ ప్రసిద్ధి పొందిందిం. విద్యుత్, ఆయిల్, గ్యాస్, వాటర్ ప్రాజెక్ట్స్ నిర్మాణంలో టెక్టాన్ ఇంజినీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్ కంపెనీ పేరుగాంచింది. ప్రపంచంలో ఆహార ధాన్యాల ఎగుమతిలో అరబ్ – ఇండియా స్పైసెస్ సంస్థ రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో ఆయా సంస్థల ఛైర్మన్‌లతో మంత్రి నారాయణ సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించనున్నారు. అనంతరం విదేశీ పర్యటనను ముగించుకుని రాత్రికి మంత్రి నారాయణ దుబాయ్ నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# యూపిలో పట్టాలు దాటుతుండగా ఘోరం

## రైలు ఢీకొని నలుగురు యాత్రికుల దుర్మరణం

**లక్నో,**

ఉత్తరప్రదేశ్‌లో రైలు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. మిర్జాపుర్‌లో బుధవారం రైల్వే పట్టాలు దాటుతున్న యాత్రికులను ఓ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందినట్లు తెలుస్తోంది. కార్తిక పౌర్ణమి నేపథ్యంలో యాత్రికులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. యాత్రికులు చోపాన్-ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ రైలులో చునార్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వారు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగారు. అక్కడి నుంచి ఎదురుగా ఉన్న ప్లాట్‌ఫాం పైకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ట్రాక్ పైకి వచ్చిన హౌరా-కల్కా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయన్నారు.

# మరికొంత తగ్గిన బంగారం వెండి

**హైదరాబాద్,**

:డాలర్ బలపడుతున్న నేపథ్యంలో బంగారం ధరలు దిగొస్తున్నాయి. ఫెడ్ రేట్‌లో కోతపై కూడా ఆశలు సన్నగిల్లుతుండటంతో బంగారం రేటు నానాటికీ పడిపోతోంది. అంతర్జాతీయ ట్రెండ్స్‌ను ప్రతిఫలిస్తూ భారత్‌లో కూడా పసిడి ధరలు దిద్దుబాటుకు లోనవుతున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ. 1,22,540గా ఉంది. నిన్నటితో పోలిస్తే సుమారు రూ.800 మేర ధరలో కోత పడింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,12,450 వద్ద కొనసాగుతోంది. వెండి ధరల్లో కూడా భారీగా కోత పడింది. కిలో వెండి ధర రూ.3200 మేర తగ్గి రూ.1,50,900కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఔన్స్ 24 క్యారెట్ బంగారం ధర 3,969 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక డాలర్ సూచీ 0.12 శాతం మేర పెరిగి 99.99కు చేరుకుంది. గత మూడు నెలల్లో ఇదే గరిష్ఠం. దీంతో, పసిడి, వెండి ధరలు దిగొస్తున్నాయి. ఈ వారమంతా బంగారం ధరల్లో దిద్దుబాట్లు తప్పవనేది మార్కెట్ వర్గాల అంచనా.

# చీమల ఫోబియాతో మహిళ ఆత్మహత్య

**సంగారెడ్డి,**

అనేక మంది అనేక రకాల వ్యాధులతో, మానసిక ఇబ్బందులతో చనిపోతుంటారు. ఆరోగ్యం బాగాలేక, లైఫ్ ఫెయిల్యూర్ కావడం, డిప్రెషన్, లోన్ల ఒత్తిడి వంటి కారణాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కానీ ఇందుకు భిన్నంగా తాజాగా జరిగిన ఓ ఘటన తీవ్రంగా కలిచివేస్తోంది. ఎలాంటి ఆరోగ్య సమస్యలు, ఫైనాన్సియల్ సమస్యలు, లైఫ్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు లేకపోయినా ఆమె చనిపోయింది. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి ముందు రాసిన సూసైడ్ నోట్ ఒక్కసారిగా షాక్ కు గురి చేస్తోంది. ఇలా కూడా చనిపోతారా? వామ్మో అంటూ ఈ విషయం తెలుసుకున్నవారు ఆశ్చర్యానికి గురవుతున్నారు.సంగారెడ్డిలో జరిగిన ఈ ఘటన తీవ్రంగా కలచివేస్తోంది. ఓ మహిళ అనూహ్యంగా మరణించిన ఘటన సంగారెడ్డి జిల్లాలో జరిగింది. చీమల ఫోబియాతో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అమీన్ పూర్ మున్సిపాలిటీలోని శర్వా హోమ్స్ లో మనీషా ఉరి వేసుకొని సూసైడ్ చేసుకుంది. చీమల ఫోబియాతో తాను చనిపోతున్నానని, తన కూతురు జాగ్రత్త అంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చీమల ఫోబియాతో మహిళా చనిపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహిణి మరణించడంతో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

# ఓట్చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

**విజయవాడ,**

బీజేపీ దొంగ ఓట్లకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ఇప్పటికే సంతకాల సేకరణ చేపట్టింది. ప్రజల నుంచి సేకరించిన సంతకాలను హస్తం నేతలు ట్రక్కులో ఢిల్లీకి పంపించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ట్రక్కును జెండా ఊపి ప్రారంభించారు. ఓట్ చోర్... గద్దీ చోర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. దొంగ ఓట్లకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల సేకరణ మొదలు పెట్టామని.. అన్ని రాష్ట్రాల సంతకాలను రామ్ లీలా మైదానానికి తెస్తామన్నారు. అక్కడ నుంచి రాష్ట్రపతికి అందజేయనున్నట్లు వైఎస్ షర్మిలా రెడ్డి పేర్కొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# అభినందనలు కాదు...ప్రోత్సాహం అందించండి !

మనదేశంలో క్రీడల్లో గెలిచాకనే అభినందనలు, ప్రశంసలు వెల్లువెత్తుతాయి. కానీ ఆడుకోవడానికి పాఠశాల స్థాయిలో లేదా కాలేజీ స్థాయిలో ప్రోత్సాహం మాత్రం అంతంత మాత్రమే. ఏ ప్రభుత్వం వచ్చినా క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం అంటుందే తప్ప..ఆచరించి చూపడం లేదు. ఈ విధానం మారలి. క్రీడలకు ప్రత్యేక పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలి. ఆర్థికంగా వారికి అండగా నిలవాలి. క్రీడ ఏదైనా నేర్చుకునేం దుకు అవసరమైన వసతులు కల్పించాలి. అప్పుడే భారత్ ప్రపంచస్థాయిలో సగర్వంగా నిలబడగలుగు తుంది. క్రీడాకరులు అందుకు సిద్దంగా ఉన్నారు. ఇటీవలి మహిళా క్రికెట్ కప్ విజేతల ప్రయాణమే ఇందుకు ఉదాహరణ. ఇందులో ఆడిన వారంతా దేశం కోసం చెమటోడ్చారు. తాము పడ్డ కష్టాన్ని మరచిపోయి, దేశ కీర్తిపతాకను రెపరెపలాడించారు. ఈ క్రమంలో ఐదు దశాబ్దాల కలను భారత మహిళలు సాకారం చేశారు. ఆకాశమే హద్దుగా అద్భుత ప్రదర్శనతో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని అమ్మాయిల జట్టు ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. అడ్డంకులన్నీ అధిగమించి, బలమైన దక్షిణాఫ్రికా జట్టును 52 పరుగులతో ఓడించడం ద్వారా భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించింది. దీంతో దేశం గర్వించింది. అయితే దీని వెనక ఒక్కో అమ్మాయి వ్యథాభరిత జీవితం ఉంది. క్రికెట్‌లో తాము రాణించడానికి వ్యక్తిగతం గా ఎంతో శ్రమించారు. ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. 1973లో మనదేశంలో మహిళా క్రికెట్ సంఘం ఏర్పడిన తర్వాత అంతర్జాతీయ పోటీల్లో భారత మహిళల ప్రస్థానం మొదలైంది. తొలితరం క్రికెటర్లు సొంత బ్యాటు, కిట్టు లేకపోయినా, జనరల్ బోగీల్లో ప్రయాణిస్తూ సొంత డబ్బులపైనో, చందాల పైనో ఆధారపడి దేశం తరపున ఆడారు. ఆ తరువాత స్పాన్సర్లు ముందుకు రావడం, 2005లో బిసిసిఐ పరిధిలోకి రావడం జరిగాయి. 2022లో పురుషుల, మహిళల జట్ల మధ్య వేతన సమానత్వాన్ని, మహిళల ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టడం,అంతర్జాతీయ క్రికెటర్లతో ఆడే అవకాశం లభించడం, ప్రతిభావంతులైన క్రికెటర్లు వెలుగులోకి రావడం వంటి పరిణామాలతో మహిళల క్రికెట్‌ను ముందుకు తీసుకెళ్లాయి. ఈ క్రమంలో వారు ఎదుర్కొన్న కష్టనష్టాలు అన్నీ దేశం కోసమే అని చెప్పక తప్పదు. తమ వ్యక్తిగత ప్రతిష్ట కోసమో లేదా డబ్బు సంపాదన కోసమో వారు ఆడలేదు. వారు భారత పతకాను ఎగరేయడం వెనక ఉన్న కష్టాలను తెలుసుకుని ప్రోత్సాహనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాలి. అవసరమైతే కేంద్రమే క్రీడలకు సంబంధించి ప్రోత్సాహక కమిటీని ఏర్పాటు చేసి ఇలాంటి కష్టాలను అధిగమించేలా చేయాలి. ఇకపోతే వరుసగా రెండుసార్లు అండర్– 19 అమ్మాయిల జట్టు ప్రపంచకప్ నెగ్గడం, తాజాగా సీనియర్ జట్టు విజయం సాధించడం మహిళా క్రికెట్‌లో ఉజ్వల భవితకు పునాది. ప్రపంచకప్‌లో వరుసగా మూడు పరాజయాలతో డీలాపడిన జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో అమోల్ మజుందార్ కోచ్‌గా, మెంటార్‌గా అందించిన ప్రోత్సాహం ఆటగాళ్లలో మానసిక దృఢత్వాన్ని తీసుకొచ్చింది. వన్డే ప్రపంచకప్ టైటిల్ కొట్టడం లో ఆటగాళ్ల పాత్ర ఎంత కీలకమో.. తెర వెనుక కోచ్ పాత్ర అంతకుమించి ఉంటుంది. క్రీడాకారిణుల ఫిట్‌నెస్, జట్టు ఎంపిక, కెప్టెన్, ఆటగాళ్లకు దిశా నిర్దేశం, డ్రింక్స్‌బ్రేక్ సమయంలో కెప్టెన్‌కు ఎత్తుగడలను చేరవేయడం.. ఇలా ప్రతి విభాగంలో కోచ్ పాత్ర మరువలేనిది. ఇందుకు నిదర్శనమే వన్డే ప్రపంచకప్‌ను సాధించిన వెంటనే టీమిండియా కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ పరిగెత్తుకొని వెళ్లి ఒక వ్యక్తి కాళ్లకు నమస్కరించి, ఆలింగనం చేసుకొని కన్నీళ్లు పెట్టుకోవడం. అతడు మరోవరో కాదు.. టీమిండియా హెడ్ కోచ్ అమోల్ మజుందార్. క్రికెటర్‌గా 21ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో ఏనాడూ జాతీయ జట్టుకు ఎంపకవ్వని ఆయన, ఇప్పుడు కోచ్‌గా మహిళా జట్టుకు దిశానిర్దేశం చేస్తున్న తీరు అభినందనీయం. ఈ విజయంలో అతనిదీ ప్రత్యేక పాత్ర అని చెప్పక తప్పదు. మజుందార్ దేశవాళీ క్రికెట్ ఆడే క్రమంలో భారత క్రికెట్ జట్టులో మరో



సచిన్ అవుతాడని భావించారు. దేశవాళీ క్రికెట్లో ముంబయి తరపున పరుగుల వరద పారించాడు. 'ది వాల్'గా పేరు తెచ్చుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచుల్లో 11,167పరుగులు చేశాడు. ఇందులో 30సెంచరీల, 60అర్థసెంచరీలు ఉన్నాయి. ఇక 113 లిస్ట్–ఎ క్రికెట్ మ్యాచుల్లో 3,286 పరుగులు కొట్టాడు. 3సెంచరీలు, 26అర్థసెంచరీలు చేశాడు. కానీ ఆయనకు ఒక్కసారి కూడా టీమిండియా తరపున ఆడే అవకాశం దక్కలేదు. అయినా నిరుత్సాహానికి గురికాలేదు. భారత మహిళలజట్టుకు కోచ్‌గా బాధ్యతలు స్వీకరించాక తన పూర్వ వైభవాన్ని రంగరించి క్రీడాకారిణులను మెరికల్లా తీర్చిదిద్దాడు. దీంతో భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ గెలవడంలో కోచ్‌గా కీలక పాత్ర పోషించాడు. భారత జట్టు కప్ గెలవడం వెనుక ఆయన కృషి, పట్టుదల ఎంత ఉందో అర్థం అవుతుంది. భారత జట్టుకు ఆడలేక పోయినప్పటికీ.. కోచ్‌గా తన కలను సాకారం చేసుకుని సంతృప్తిని పొందాడు. డిఫెండింగ్ ఛాంపియన్, అప్పటికే ఓసారి ఓడించిన ఆస్ట్రేలియా సెమీ ఫైనల్స్‌లో 338 రన్స్ చేయడంతో భారత్ ఓడిపోతుందని క్రీడా పండితులు అంచనా వేశారు. ప్రత్యర్థులంతా చుట్టుముడుతున్నా సహచరులు ఒక్కొక్కరు అవుటవుతున్నా అవరోధాల కు ఎదురొడ్డి ఆస్ట్రేలియాపై అజేయంగా 127 పరుగులుచేసి భారత్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర జెమిమా రోడ్రిగ్స్‌దే. 'ఐ వుడ్ లైక్ టు థాంక్ జీసస్' అన్న ఆమె మాటలను బట్టి ఆమె దైవబలంతో ముందుకు సాగారని గుర్తించాలి. కడపజిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల నల్లపురెడ్డి శ్రీచరణి లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్‌గా 9 మ్యాచ్‌లు ఆడి, 14 వికెట్లు తీయడం ద్వారా ప్రపంచకప్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లుసైతం ఆమె బౌలింగ్‌ను ఎదుర్కోవ డానికి ఆపసోపాలు పడటం ఆమె నైపుణ్యానికి నిదర్శనం. 22 వికెట్లతో మన దేశానికే చెందిన దీప్తిశర్మ మొదటిస్థానాన్ని దక్కించుకుని, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌ను సొంతం చేసుకుంది. అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా వైస్ కెప్టెన్ స్మృతి మందాన నిలిచింది. గ్రూప్ దశలో బ్యాటింగ్‌లో స్మృతీ మంధాన, ప్రతీకా రావల్, అమన్‌జోత్, రిచా ఘోష్, బౌలింగ్‌లో దీప్తి శర్మ, క్రాంతిగౌడ్, రేణుకాసింగ్ సత్తా చాటారు. ఫైనల్స్ లో షఫాలీ వర్మ సూపర్ ఇన్నింగ్స్, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో, హర్మన్ ప్రీత్‌కౌర్ కెప్టెన్సీ ఇలా అందరి సమిష్టి కృషే జగజ్జేతగా నిలిపింది. జట్టులోని చాలామంది దిగువ మధ్యతరగతివారే. శ్రీచరణి తండ్రి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో చిన్న ఉద్యోగి. గ్రామీణ నేపథ్యం నుంచి కెప్టెన్‌గా హర్మన్ ప్రీత్ ఎదిగారు. మూడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న రేణుక, పోలీస్ కానిస్టేబుల్ కుమార్తె క్రాంతిగౌడ్, తన తండ్రి చెక్కిన బ్యాట్‌తో కెరీర్ మొదలు పెట్టిన అమన్‌జోత్ లాంటి వారంతా అనేక కష్టాలను ఎదురొడ్డి నిలిచిన వారే. ఇన్ని కష్టాల మధ్య కుటుంబ సభ్యులు, కోచ్‌లు లేదా ఇంకెవరైనా ప్రోత్సాహంతో రాణిస్తున్నారే తప్ప ప్రభుత్వ తోడ్పాటు, ప్రోత్సాహం కరువవుతున్నాయి. క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, క్రీడాకారులు రాణించడానికి కావలసిన ప్రోత్సాహం ప్రభుత్వాల నుంచి రావాలి. వారిని రంగం మీద నిలిపి గెలుపుగుర్రాలుగా మలచాలి.

# ఇది ప్రమాదం కాదు.. ప్రభుత్వ హత్య!

## – చేవెళ్ల రహదారి 20 ప్రాణాలను బలి తీసుకుంది..

## – నిర్లక్ష్య పాలనపై ప్రజల్లో ఆగ్రహం..

మెదక్ , నవంబర్06 ( అక్షర కలం):-

తెలంగాణ ప్రజలను కలచివేసిన చేవెళ్ల భయంకర రోడ్డు ప్రమాదం రాష్ట్రాన్ని షాక్‌కు గురి చేసింది. ఆదివారం తెల్లవారుజామున కంకర లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 20 మంది ప్రాణాలు కాసేపులో రక్తసిక్తమయ్యాయి. రహదారి మీద రక్తపు మరకలు, చెల్లాచెదురైన వస్త్రాలు, కన్నీరుతో విలపిస్తున్న కుటుంబాలు... ఈ దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాన్ని ముక్కలు చేసింది.

### – నిర్లక్ష్యం వల్లే ప్రాణాల బలి..

చేవెళ్లహైదరాబాద్ రహదారి గత కొంతకాలంగా ప్రమాదాల హాట్‌స్పాట్‌గా మారింది. రోడ్లపై గుంతలు, లైటింగ్ సదుపాయాలు లేకపోవడం, నియంత్రణ బోర్డులు లేకపోవడంఇవి ప్రతిరోజు ప్రయాణికుల ప్రాణాలపై ముప్పు తెస్తున్నాయి. ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా, సంబంధిత అధికారులు, రాజకీయ నాయకులు ఎవరూ పట్టించుకోలేదు. "రోడ్లు సరిగా ఉంటే మా వాళ్లు బ్రతికేవారు" అని బాధిత కుటుంబాల ఆవేదన కన్నీటి స్వరంగా మారింది.

### – ప్రతి ప్రమాదం తర్వాత ఫోటోలు, హామీలు..అంతే..

ప్రతి ప్రమాదం తర్వాత ఒకే సీఎ అధికారులు, నాయకులు ఘటనాస్థలికి వచ్చి ఫోటోలు దిగడం, సానుభూతి హామీలు ఇవ్వడం, తర్వాత మళ్లీ అదే నిర్లక్ష్యం. రోడ్డు సురక్షితతపై చర్యలు లేవు. ఈసారి అయితే ప్రజల కోపం ఉధృతమైంది. "ఇది ప్రమాదం కాదు ఇది ప్రభుత్వ హత్య!" అని బాధితుల బంధువులు ఆవేదనతో కేకలు వేస్తున్నారు.

### – 20 కుటుంబాల కేకలు ప్రభుత్వం సమాధానం చెప్పాలి..



మరణించినవారిలో చిన్నారులు, మహిళలు, గర్భిణీలు ఉన్నారు. ఒకే కుటుంబంలోని ముగ్గురి నుంచి ఐదుగురి వరకు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలు చీకటిలో మునిగిపోయాయి. ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలి అయిన ఈ కుటుంబాలకు ఇప్పుడు ధైర్యం చెప్పేవారు ఎవరూ లేరు. రాజకీయ నాయకులు మౌనంగా ఉన్నారు, అధికారులు సురక్షిత బంగ్లాల్లో ప్రశాంతంగా ఉన్నారు. కానీ ప్రజలు మాత్రం ప్రశ్నిస్తున్నారు %–% "మా ప్రాణాలు ప్రభుత్వానికి విలువలేవా?"

### – డబ్బులతో ప్రాణ బిక్ష కాదు భద్రత కావాలి..

ప్రతి ప్రమాదం తర్వాత ఐదు నుంచి పది లక్షల ఆర్థిక సాయం ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదు. ప్రజలు ఇప్పుడు న్యాయం కోరుతున్నారు, భద్రత కోరుతున్నారు. రోడ్ల నాణ్యత, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణఇవి అమలు కాకపోతే ప్రతి రహదారి మరణ రహదారిగానే మిగిలిపోతుందని హెచ్చరిస్తున్నారు.

### – ప్రతి మరణం ఒక హెచ్చరిక..

చేవెళ్ల ఘటన తెలంగాణ ప్రభుత్వానికి ఒక జాగ్రత్త గడియారం లాంటిదని ప్రజలు అంటున్నారు. ఈ ఘటనలో 20 కుటుంబాలు జీవితాంతం కన్నీటి బంధంలో చిక్కుకుపోయాయి. ప్రజల కేక ఒకటే ం "ఇక మేము సానుభూతి కాదు, భద్రత కావాలి." రోడ్లపై ప్రాణాలు కోల్పోతున్న ప్రతి వ్యక్తి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలయ్యాడు.
చేవెళ్ల రహదారి ఈరోజు 20 ప్రాణాలు బలి తీసుకుంది
రేపు ఎవరి వంతు?




# సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలి

## తాండూరు సిఐ దేవయ్య

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 06:

నేర ప్రవృత్తి కలిగిన వారు సమాజంలో సత్ప్రవర్తనతో మెలుగుతూ, నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తాండూరు సిఐ దేవయ్య సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ ల సూచనల మేరకు గురువారం జిల్లాలోని తాండూరు సిఐ కార్యాలయంలో



ఆయన తాండూరు పోలీస్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరాలకు దూరంగా ఉంటూ, సత్ప్రవర్తనతో ఉన్నవారిపై రౌడీ షీట్ తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మారాలని అన్నారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో సత్ప్రవర్తన కలిగి, హుందాగా జీవించాలని సూచించారు. నేరస్తులు తొందరపాటులో నేరాలకు పాల్పడటం మూలంగా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రౌడీషీటర్లు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మంచిగా మారాలని, లేని పక్షంలో రౌడీషీటర్ అనే పదం తమ బిడ్డల భవిష్యత్‌ను నాశనం చేస్తుందని తెలిపారు. డాక్టర్ పిల్లలు డాక్టర్లుగా, పోలీస్ అధికారుల పిల్లలు పోలీస్ అధికారులుగా అవుతున్నారని, రౌడీ షీటర్ల పిల్లలు తమ తల్లిదండ్రులను అనుసరిస్తే నేరస్తులుగా మారుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రౌడి షీటర్లు తమ నేరప్రవృత్తిని మార్చుకోవడానికి అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. రౌడీ షీట్ ఉన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని, అదే సందర్భంలో వారు చేసే మంచి పనులు సైతం షీట్ లో నమోదు చేసి, వారు మారేందుకు అవకాశం ఇస్తామని, పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగిస్తామన్నారు. రౌడీ షీటర్లు గతాన్ని మరిచిపోయి మారిన మనస్సుతో జీవితంలో ముందడుగు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు జిల్లా వ్యాప్తంగా వందేమాతర జాతీయ గీతం సామూహిక ఆలాపన

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 7న జిల్లా వ్యాప్తంగా వందేమాతర జాతీయ గీతం సామూహికాలాపన చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. బంకిం చంద్ర చటర్జీ వందేమాతరం జాతీయ గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ,ప్రయివేటు పాఠశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలలో 7 న ఉదయం 10 గంటలకు వందేమాతరం జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10.00 గంటలకు వందేమాతరం సామూహిక గీతాలాపన ఉంటుందని తెలిపారు.

# ఈనెల 7, 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న ఇరాన్ దేశానికి సంబంధించిన సినిమా ప్రదర్శన కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు.

హైదరాబాద్ అక్షర కలం

హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధి శ్రీ మోహ్సెన్ గారు మంత్రి గారిని ఆయన అధికారిక నివాసంలో కలుసుకుని ఈ ఆహ్వానం అందించారు.ఈ సందర్భంగా ఇరానియన్ సినీ రంగానికి సంబంధించిన పలు అంశాలతో పాటు, ఉగ్రవాదం నేపథ్యంగా రూపొందించిన " చంద్రుడు నిండుగా ఉన్నప్పుడు. సినిమాపై ఇరువురి మధ్య విశదంగా చర్చ జరిగింది.ఈ ప్రదర్శన కార్యక్రమానికి ప్రముఖ ఇరానియన్ దర్శకులు, నటులు కూడా హాజరవనున్నట్లు తెలియజేస్తూ, సినిమాటోగ్రఫీ మంత్రిగా మీరు హాజరై పాల్గొనాలని శ్రీ మోహ్సెన్ గారు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు.



# కాబోయే డాక్టర్లు ఇదేం పని.?

## నల్గొండ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం.! ప్రిన్సిపల్ కు ఫిర్యాదు చేసిన విద్యార్థులు.? అదేంలేదుంటున్నా యాజమాన్యం



అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

నల్లగొండ మెడికల్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేశారని వస్తున్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. మీడియాకు అందిన సమాచారం మేరకు గత నెల 31వ తేదీన హాస్టల్‌లో జూనియర్స్ ను సెకండియర్ స్టూడెంట్స్ ర్యాగింగ్ చేసినట్లు సమాచారం. జూనియర్ విద్యార్థులకు అశ్లీల వీడియోలను చూపించిన సీనియర్లు ఆ వీడియోలో ఉన్న విధంగా చేయాలని ర్యాగింగ్ చేశారని జూనియర్లు ఆరోపిస్తున్నారు. తమను ర్యాగింగ్ పేరుతో వేధించిన సీనియర్ విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జూనియర్లు కళాశాల ప్రిన్సిపల్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయినా కూడా బాధిత విద్యార్థుల ఫిర్యాదును ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూనియర్ విద్యార్థులు తమపై ఫిర్యాదు చేయడాన్ని నేరంగా పరిగణించిన సీనియర్ విద్యార్థులు తమపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఈనెల 4వ తేదీన మళ్ళీ ర్యాగింగ్ చేసినట్టు తెలిసింది. మీడియాలో మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ జరిగినట్లు వార్తలు వెలువడడంతో అప్రమత్తమైన పోలీసులు మెడికల్ కళాశాలను సందర్శించారు.అయితే వైద్య విద్యను అభ్యసించే వారే తోటి జూనియర్ ను వేధింపులకు గురిచేయడం ఎంతవరకూ కరెక్ట్ అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే కళాశాల యాజమాన్యం మాత్రం అదేం లేదంటూ కొట్టి పారేస్తున్నారు.

### అందులో ఎలాంటి వాస్తవం లేదు...

### డాక్టర్ సత్యనారాయణ (మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నల్గొండ)

మెడికల్ కళాశాల హాస్టల్ లో సీనియర్ విద్యార్థులు జూనియర్లను ర్యాగింగ్ చేశారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని నల్లగొండ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. విషయం తెలియగానే సీనియర్, జూనియర్ విద్యార్థులను వేర్వేరుగా పిలిపించి అడిగాను. అది అవాస్తమని చెప్పారు. మెస్ లో కేవలం విద్యార్థుల పేరు, ఎక్కడి నుంచి వచ్చారు, ఏ కళాశాల నుండి వచ్చారు, అని మాత్రమే కాస్త గట్టిగా అడిగామని సీనియర్లు చెప్పారు. మొదట మీడియాలో స్క్రోలింగ్ రావడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఇంటెలిజెన్స్ వారు కూడా వచ్చారు. వారు కూడా విద్యార్థులను పిలిపించి వాస్తవాలను అడిగి తెలుసుకున్నారు. ర్యాగింగ్ అవాస్తమని ప్రెస్ నోట్ ని కూడా విడుదల చేశాం.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## త్వరలో పెళ్లి బంధంలోకి స్మృతి అడుగు

ప్రపంచ ఛాంపియన్ స్మృతి మంధాన త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. స్మృతి తన ప్రియుడు పలాష్ ముచ్చల్ తో పెళ్లి చేసుకోనున్నారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ దాదాపు 6 సంవత్సరాలుగా ఒకరితో ఒకరు ఉన్నారు. భారతదేశం ప్రపంచ కప్ గెలిచిన తర్వాత కూడా పలాష్, స్మృతితో కనిపించారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వరల్డ్ కప్ ట్రోఫీతో ఫోటో దిగారు. ఈ జంట భారతదేశం సాధించిన విజయాన్ని కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు.పలాష్ తన చేతిపై స్మృతి మంధానా పేరుతో టాటూ కూడా వేయించుకున్నారు. పలాష్ తన సోషల్ మీడియాలో దీని ఫోటోను కూడా షేర్ చేశాడు.పలాష్ ముచ్చల్ సంగీత దర్శకుడు. పలాష్ సోదరి, గాయని పలక్ ముచ్చల్‌తో కూడా స్మృతి మంధానకు మంచి సంబంధం ఉంది. పలక్ ముచ్చల్ స్మృతి పుట్టినరోజున కలిసిన ఫోటో కూడా షేర్ చేసింది. పలాష్ 'తూ హి హై ఆషికీ', 'పార్టీ తో బనతీ హై' వంటి హిట్ పాటలపై వర్క్ చేశారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ లవ్ స్టోరీ 2019లో ప్రారంభమైంది. పలాష్ తన సోదరి పలక్ ముచ్చల్ ముందు స్మృతికి ప్రపోజ్ చేశాడు, ఆమె కోసం చాలా అందమైన పాట కూడా పాడాడు.పలాష్ ముచ్చల్ స్మృతి మంధానతో తన సంబంధం గురించి జూలై 2024లో వెల్లడించాడు, అప్పుడు వారి సంబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. పలాష్ ఇటీవల మాట్లాడుతూ స్మృతి మంధానా త్వరలో ఇండోర్ కోడలు కాబోతోందని కూడా చెప్పాడు. ఆనంద బజార్ పత్రిక ప్రకారం, ఈ జంట వివాహం నవంబర్ 20, 2025 న జరగవచ్చు. వీరి వివాహం స్మృతి స్వస్థలమైన సాంగ్లీలో జరగవచ్చు.

## క్రికెట్ జెంటిల్మెన్ గేమ్ కాదు

భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ %×జజ% మహిళల వన్డే ప్రపంచ కప్ నెగ్గిన తర్వాత చాలా సంతోషంగా ఉంది. వరల్డ్ కప్ సాధించిన తరువాత తన మొదటి సోషల్ మీడియా పోస్ట్ షేర్ చేసింది. అయితే ఈ పోస్ట్ సంచలనం సృష్టించింది. భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రపంచ కప్ విజేత కెప్టెన్‌గా నిలిచిన హర్మన్ ప్రీత్ ఈ పోస్ట్ కేవలం వేడుకలతో లేదు, ఇది అందరి దృష్టిని ఆకర్షించిన ఒక రహస్య సందేశంలా మారింది. హర్మన్‌ప్రీత్ ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రోఫీతో తన ఫోటోను షేర్ చేసింది. ఆమె ధరించిన టీషర్టుపై "క్రికెట్ కేవలం జెంటిల్‌మెన్ గేమ్ మాత్రమే కాదు" అని రాసి ఉంది. సాధారణంగా క్రికెట్ అంటే జెంటిల్మెన్ గేమ్ అని వ్యవహరిస్తారు. అయితే హర్మన్ టీషర్టుపై క్రికెట్ అందరి గేమ్ అని స్పష్టం చేసింది. అందుకోసం జెంటిల్మెన్ గేమ్ అనే పదాలను కొట్టివేస్తున్నట్లుగా ఆమె జెర్సీపై రాసి ఉంది. క్రికెట్ ఇప్పుడు కేవలం "పురుషుల ఆట" మాత్రమే కాదు, మహిళలది కూడా అని సందేశాన్ని ఇచ్చింది. మహిళా క్రికెటర్లు ఇప్పుడు క్రికెట్‌లో సమాన గౌరవం, గుర్తింపునకు అర్హులని హర్మన్ సందేశం స్పష్టంగా ఉంది. హర్మన్‌ప్రీత్ పోస్ట్ మహిళా క్రికెట్ మారుతున్న తీరును వివరిస్తుంది. చాలా సంవత్సరాలుగా క్రికెట్‌ను పురుషుల ఆట (జెంటిల్మెన్ గేమ్)గా చూశారు. కాని ఇప్పుడు భారత మహిళా జట్టు ఈ ఆట ఇకపై 'పురుషుల'ది మాత్రమే కాదు, 'మహిళల'ది కూడా అని నిరూపించేలా వన్డే వరల్డ్ కప్ గెలిచి విశ్వవిజేతగా నిలిచింది. హర్మన్ చేసిన ఈ పోస్ట్‌ను లక్షలాది మంది లైక్ చేశారు. వేలాది మంది వ్యాఖ్యానించి ఆమె ఆత్మవిశ్వాసాన్ని, ఆలోచనను ప్రశంసించారు.ప్రపంచ కప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా మీద భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. నవీ ముంబైలోని డివై పాటిల్ స్టేడియంలో ఆదివారం జరిగిన డే అండ్ నైట్ జరిగిన మ్యాచ్‌లో టీమిండియా దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి మహిళల వన్డే ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. ఓపెనర్లు షెఫాలీ వర్మ 87 పరుగులు, స్మృతి మంధాన 45 పరుగులతో రాణించారు. మిడిలార్డర్ లో దీప్తి శర్మ విలువైన 58 పరుగులు, రిచా ఘోష్ 24 బంతుల్లో 34 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించారు. టార్గెట్ ఛేదనలో సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ సెంచరీ సాధించింది. ఆ జట్టు 45.3 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్ తొలిసారి వన్డే వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. ఐదు దశాబ్దాల వరల్డ్ కప్ కల నెరవేరడంతో మహిళల క్రికెట్‌లో కొత్త జోష్ కనిపిస్తోంది.

## బిగ్ బాష్ లీగ్ నుంచి తప్పుకున్న అశ్విన్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్?లో ఆడటానికి సిద్ధమైన భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. బీబీఎల్ తదుపరి సీజన్‌లో సిడ్నీ థండర్ తరఫున ఆడడం దాదాపు ఖాయమైనప్పటికీ, గాయం కారణంగా ఆయన ఈ లీగ్ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. అశ్విన్ గనుక ఆడి ఉంటే, బీబీఎల్లో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా చరిత్ర సృష్టించి ఉండేవారు. అశ్విన్‌కు అయిన గాయం ఏమిటి? ఎప్పుడు తిరిగి వచ్చే అవకాశం ఉంది? వంటి వివరాలు ఈ వార్తలో చూద్దాం. భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెట్ మైదానంలోకి తిరిగి రావడానికి మరింత వేచి చూడాల్సి వస్తుంది. మోకాలి గాయం కారణంగా



ఆయన ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ నుంచి తప్పుకున్నారు. అశ్విన్ బీబీఎల్ లో సిడ్నీ థండర్ జట్టు తరఫున పూర్తి సీజన్ ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒకవేళ అశ్విన్ ఆడి ఉంటే బీబీఎల్ చరిత్రలో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా నిలిచి ఉండేవారు. కానీ గాయం కారణంగా ఈ చారిత్రక అవకాశం ప్రస్తుతానికి మిస్ అయింది. అశ్విన్ త్వరగా కోలుకుంటే, సీజన్ మధ్యలో సిడ్నీ థండర్ జట్టు అతన్ని తిరిగి ఆడటానికి ఆహ్వానించే అవకాశం ఉంది. అశ్విన్ స్వయంగా సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేసి, తన గాయం, బీబీఎల్ నుంచి వైదొలగడం వెనుక కారణాలను తెలియజేశారు. "బీబీఎల్ తదుపరి సీజన్‌కు చెన్నైలో సిద్ధమవుతున్న సమయంలో నాకు మోకాలిలో గాయం అయింది. పరీక్షల తర్వాత, నేను బీబీఎల్ 15లో ఆడలేనని తెలిసింది" అని అశ్విన్ తన ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియన్ అభిమానుల ముందు ఆడటానికి తాను ఎంతగానో ఉత్సాహంగా ఉన్నానని, కానీ ఈ నిర్ణయం తీసుకోవడం తనకు బాధ కలిగించిందని ఆయన వ్యక్తం చేశారు. సిడ్నీ థండర్ ఆటగాళ్లు, సిబ్బంది తనకు పూర్తి మద్దతు ఇచ్చారని అశ్విన్ తెలిపారు. మైదానంలో లేకపోయినా, తాను థండర్ మహిళా, పురుషుల జట్లను ఉత్సాహపరుస్తూ ఉంటానని చెప్పారు. రవిచంద్రన్ అశ్విన్ అదే సంవత్సరంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత బీబీఎల్ లో ఆడాలని నిర్ణయించుకున్నారు. అశ్విన్ ఈ సంవత్సరం ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఆ తరువాత అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటానికి మొగ్గు చూపాడు. బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ డిసెంబర్ 14 నుంచి జనవరి 25 వరకు జరగనుంది. సిడ్నీ థండర్ జట్టు తమ మొదటి మ్యాచ్‌ను డిసెంబర్ 16న హొబర్ట్ హరికేన్స్‌తో ఆడాల్సి ఉంది. ఈ మధ్యలో అశ్విన్‌కు ఐఎల్టీ20 లీగ్‌లో ఏ జట్టు కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం.




## నంబర్ 1 స్థానాన్ని కోల్పోయిన స్మృతి మంధాన

భారత మహిళా క్రికెట్ జట్టు ప్రపంచకప్ 2025 విజయంలో కీలక పాత్ర పోషించిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధానకు ఊహించని షాక్ తగిలింది. టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత క్రీడాకారిణిగా నిలిచినప్పటికీ ఐసీసీ తాజాగా విడుదల చేసిన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆమె నంబర్ 1 స్థానాన్ని కోల్పోయింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు సాధించడంతో మంధానను వెనక్కి నెట్టి నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. భారత క్రికెట్‌కు గర్వకారణంగా నిలిచిన స్మృతి మంధాన.. ర్యాంకింగ్స్‌లో ఎలా వెనుకబడింది..భారత మహిళా జట్టు ప్రపంచకప్ 2025లో విజయం సాధించిన తర్వాత, అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా వన్డే ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానంలో మార్పు చోటు చేసుకుంది. చాలా కాలంగా నంబర్ 1 స్థానంలో ఉన్న భారత ఓపెనర్ స్మృతి మంధాన, ఇప్పుడు 811 రేటింగ్ పాయింట్లు సాధించి రెండో స్థానానికి పడిపోయింది. ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్, 814 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. ప్రపంచకప్‌లో స్మృతి మంధాన అద్భుతమైన ఫామ్‌ను ప్రదర్శించింది. ఆమె భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. స్మృతి మంధాన టోర్నమెంట్‌లో ఆడిన 9 మ్యాచ్‌ల్లో 54.25 సగటుతో మొత్తం 434 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఆమె 45 పరుగులు చేసి జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చింది. ఇంత మంచి ప్రదర్శన చేసినప్పటికీ, సౌతాఫ్రికా బ్యాటర్ లారా వోల్వార్డ్ స్మృతి మంధాన కంటే ఎక్కువ రేటింగ్ పాయింట్లు సాధించడం వలన, స్మృతి మంధాన తన నంబర్ 1 కిరీటాన్ని కోల్పోవాల్సి వచ్చింది. సౌతాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ ప్రపంచకప్‌లో బ్యాట్‌తో సంచలనం సృష్టించింది. ఆమె జట్టు ఫైనల్ ఓడినప్పటికీ, ఆమె వ్యక్తిగత ప్రదర్శన అసాధారణంగా ఉంది. లారా వోల్వార్డ్ ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. భారత్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఆమె సెంచరీ సాధించి, ఒంటరి పోరాటం చేసింది. అయితే, మిగిలిన దక్షిణాఫ్రికా బ్యాటర్లు హాఫ్ సెంచరీలు కూడా చేయలేకపోయారు. ఆమె అద్భుతమైన స్థిరత్వం కారణంగానే వన్డే ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానం దక్కింది.

## ఐసీసీ మీటింగ్‌కు మొహ్సిన్ నఖ్వీ డుమ్మా

భారతదేశం ఆసియా కప్ 2025 విజేతగా నిలిచి నెల రోజులు దాటినా.. ఇప్పటివరకు టీమిండియాకు కప్ దక్కలేదు. ఈ విషయంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ తీరు వివాదాస్పదంగా మారింది. భారత్ తరఫున బీసీసీఐ కప్ ఇవ్వాలని పదేపదే లేఖ రాసినా నఖ్వీ పట్టించుకోవట్లేదు. ఈ సమస్య ఇప్పుడు దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో చర్చకు రానుంది. అయితే, ఈ మీటింగ్‌కు నఖ్వీ గైర్హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీసీఐ హెచ్చరికకు భయపడే ఆయన సమావేశాన్ని తప్పించుకుంటున్నారా అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం దుబాయ్‌లో ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశాలు జరుగుతున్నాయి. ఈ కీలక సమావేశాలకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ హాజరు కావడం కష్టమని తెలుస్తోంది. దేశీయ రాజకీయ సమస్యల కారణంగానే నఖ్వీ దుబాయ్‌కు రాలేకపోతున్నారని పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ సమావేశంలో బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ అప్పగించడంలో ఆలస్యంపై అంశాన్ని లేవనెత్తే అవకాశం ఉంది. దీని వలన నఖ్వీపై ఒత్తిడి పెరగవచ్చని భావిస్తున్నారు. నఖ్వీ స్థానంలో బోర్డు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ సయ్యద్ ముఖ్య కార్యనిర్వహణ అధికారుల సమావేశంలో పాల్గొంటారు. నవంబర్ 7న జరగబోయే కీలక బోర్డు మీటింగ్‌లో కూడా సయ్యద్ పాకిస్తాన్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. నఖ్వీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనే ఛాన్స్ కూడా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ జరిగింది, కానీ కప్ మాత్రం ఇంకా విజేతలైన టీమిండియాకు అందలేదు. ఆసియా కప్ ఫైనల్ ముగిసిన నెల రోజులు దాటినా, ట్రోఫీ ఇప్పటికీ దుబాయ్‌లోని ఏసీసీ ప్రధాన కార్యాలయంలో లాక్ చేసి ఉంది. ట్రోఫీని వెంటనే ముంబైకి పంపించాలని బీసీసీఐ, ఏసీసీకి లేఖ రాసింది.





అయితే, నఖ్వీ మాత్రం బీసీసీఐ ప్రతినిధికి లేదా భారత జట్టు సభ్యుడికి తానే స్వయంగా కప్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. అందుకే కప్ అప్పగించడంలో ఆలస్యం జరుగుతోంది. ఫైనల్ మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించడానికి నిరాకరించడం ఈ వివాదానికి మూల కారణం. నఖ్వీ భారత్ వ్యతిరేక ప్రకటనలు చేశారనే కారణంతో టీమిండియా ఆటగాళ్లు ఫైనల్ తర్వాత ఆయన చేతుల మీదుగా కప్ అందుకోవడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే మొహ్సిన్ నఖ్వీపై చర్యలు తీసుకోవాలని బీసీసీఐ ఐసీసీ సమావేశంలో డిమాండ్ చేసే అవకాశం ఉంది. గతంలో జై షా ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుంచి నఖ్వీ ఏ ఐసీసీ మీటింగ్‌లోనూ పాల్గొనలేదు. నఖ్వీ పాకిస్తాన్‌లో హోం మంత్రిగా కూడా ఉన్నారు.

## జైస్వాల్ మెరుపు సెంచరీ

### పలు రికార్డులు నమోదు

భారత యువ క్రికెట్ సంచలనం యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో సెంచరీ సాధించాడు. ప్రస్తుతం రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై తరఫున ఆడుతున్న జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు సెంచరీతో జట్టును కష్టాల నుంచి గట్టెక్కించాడు. ఈ సెంచరీతో అతను తన అద్భుతమైన టచ్‌ను ప్రదర్శించడమే కాక, గత 45 ఏళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ సగటు కలిగిన ఓపెనర్లలో నెంబర్ 1 స్థానంలో ఎందుకు ఉన్నాడో మరోసారి నిరూపించాడు. రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై జట్టు



తరఫున ఆడుతున్న యశస్వి జైస్వాల్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన చేశాడు. జైస్వాల్ కేవలం 120 బంతుల్లోనే 11 బౌండరీల సహాయంతో ఈ సెంచరీని పూర్తి చేశాడు. ఈ సెంచరీతో రాజస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో తీసుకున్న భారీ ఆధిక్యం (300ం రన్స్) ఒత్తిడి నుంచి ముంబై జట్టును గట్టెక్కించాడు. ఇది అతని ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్‌లో 17వ సెంచరీ కావడం విశేషం. అంతేకాక, రెడ్ బాల్ క్రికెట్ ఆడిన గత నాలుగు ఇన్నింగ్స్‌లలో అతను రెండు సెంచరీలు, మూడు యాభైకి పైగా స్కోర్‌లు చేశాడు. ఈ సెంచరీతో యశస్వి జైస్వాల్ కేవలం దేశీయ క్రికెట్‌లో మాత్రమే కాక, అంతర్జాతీయ స్థాయిలో కూడా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నాడు.



అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం 2,000 టెస్ట్ పరుగులు చేసిన ఓపెనర్లలో, జైస్వాల్ ఒక అరుదైన రికార్డును నెలకొల్పాడు. అతను 1980 నుంచి ఇప్పటివరకు ఉన్న ఓపెనర్లలో అత్యుత్తమ సగటు కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ సగటు 52.60గా ఉంది. ఈ విషయంలో అతను ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్‌ను వెనక్కి నెట్టాడు, హేడెన్ సగటు 50.73 గా ఉంది. ఈ గణాంకాలు టెస్ట్ క్రికెట్‌లో అతని అద్భుతమైన స్థిరత్వాన్ని తెలియజేస్తాయి. రాజస్థాన్ మొదటి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యం కారణంగా, ముంబై జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కష్టాల్లో ఉండే అవకాశం ఉంది. ఈ సమయంలో జైస్వాల్ ఇన్నింగ్స్ జట్టుకు చాలా అవసరం. యశస్వి జైస్వాల్, ముషీర్ ఖాన్ జోడి మొదటి వికెట్‌కు ఏకంగా 149 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, ముంబైకి పటిష్టమైన పునాదిని వేశారు. ముషీర్ ఖాన్ 63 పరుగులు చేసి ఔటైనా, జైస్వాల్ క్రీజులో నిలకడగా ఉండి తన సెంచరీ పూర్తి చేశాడు. అతని ఈ అసాధారణ ఇన్నింగ్స్ ముంబైని సురక్షితమైన స్థితికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.

## శ్రీచరణి వల్లే భారత్ గెలిచింది

### శ్రీచరణిపై అశ్విన్ ప్రశంసల జల్లు

భారత మహిళా స్పిన్నర్, తెలుగు తేజం నల్లపురెడ్డి శ్రీచరణిపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. శ్రీ చరణి అద్భుత ప్రదర్శనతోనే టీమిండియా విజేతగా నిలిచిందని కొనియాడాడు. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్లో 52 పరుగుల తేడాతో విజయం సాధించి తొలి ప్రపంచకప్‌ను ముద్దాడింది.ఈ టోర్నీలో ఆంధ్ర ప్రదేశ్, కడప జిల్లాకు చెందిన 21 ఏళ్ల శ్రీ చరణి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ఫైనల్‌తో సహా సెమీఫైనల్లో శ్రీ చరణి కట్టడిగా బౌలింగ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రపంచకప్ ఆడిన తొలి క్రికెటర్ గుర్తింపు పొందిన శ్రీచరణి.. పటిష్టమైన ఆస్ట్రేలియాపై లీగ్ మ్యాచ్‌తో పాటు సెమీఫైనల్లో అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై ఆమె 5 వికెట్లు పడగొట్టింది. సెమీఫైనల్ ఓటమి తర్వాత ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ.. భారత జట్టులో శ్రీ చరణి ప్రమాదకరమైన బౌలర్ అని పేర్కొంది. అంటేనే ఆమె ప్రభావం ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు.తాజాగా ఈ విజయంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. శ్రీ చరణిని ప్రత్యేకంగా కొనియాడాడు. భవిష్యత్తులో ఆమె సూపర్ స్టార్ అవుతుందని జోస్యం చెప్పాడు. ఆమె బౌలింగ్ టెక్నిక్ అద్భుతంగా ఉందని కొనియాడాడు. మహిళల క్రికెట్‌లో గొప్ప స్పిన్నర్లు అయిన సోఫీ ఎక్లెస్టోన్, జెస్ జోనాసెలతో శ్రీచరణిని పోల్చాడు. 'శ్రీ చరణి బంతి తిప్పే విధానం, వేగం అద్భుతం. ఆమె బౌలింగ్ టెక్నిక్ సోఫీ ఎక్లెస్టోన్, జెస్ జోనాసెన్, సోఫీ మోలినెక్స్ వంటి టాప్ స్పిన్నర్ల తరహాలోనే ఉంది. ఆమె వెయిట్ ట్రాన్స్‌ఫర్ అమోఘం. బౌలింగ్ చేసే సమయంలో ఆమె శక్తి ఏం వృథా కావడం లేదు. భవిష్యత్తు శ్రీచరణి తప్పకుండా సూపర్ స్టార్ బౌలర్ అవుతుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

# ఉపాధి కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేకూర్చాలి

సిపిఐ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ వినతిపత్రం



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 06:**

జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏరియా హాస్పిటల్ నుండి కూరగాయల మార్కెట్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం వలన రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేకూర్చాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం సిపిఐ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధి పనులను ఆహ్వానిస్తున్నామని, ఈ రోడ్డు విస్తరణలో వ్యాపారులు, చిరు వ్యాపారుల జీవనోపాధి అయిన దుకాణాలు కోల్పోయి, ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. గతంలో సైతం రోడ్డు విస్తరణలో ఉపాధి కోల్పోయిన వారి పరిస్థితి దయనీయమైందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉపాధి కోల్పోతున్న వారందరి సమాచారాన్ని సేకరించి, పారదర్శకంగా ఎటువంటి అవినీతికి చోటు లేకుండా, వారు ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వమే దుకాణాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా పట్టణంలో ప్రజలు షాపింగ్ చేయుటకు వస్తే, వారి వాహనాలు నిలుపుకొనుటకు పార్కింగ్ స్థలం లేదని, దానివల్ల వాహనాలను రోడ్డుపైనే నిలుపగా, పోలీసులు ఫోటోలు తీసి, చలాన్లు విధిస్తున్నారని తెలిపారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతూ జరిమానాలు చెల్లిస్తున్నారన్నారు. బెల్లంపల్లి బజార్ ఏరియాలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేష్, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు బొల్లం సోనీ లు పాల్గొన్నారు.

# తిరుమలనాథ స్వామి ఆలయ భూములను పరిరక్షిస్తాం : ఆర్డీవో అశోక్ రెడ్డి



**చిట్యాల: ( నవంబర్ 6) అక్షర కలం ,**

తిరుమలనాథ స్వామి దేవాలయ మరియు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామానికి చెందిన శ్రీ తిరుమలనాథ స్వామి దేవాలయ భూములను సర్వే నెంబర్ 201లలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం మరియు కాలుష్య పరిశ్రమ ఏర్పాటుకు జాతీయ రహదారి నుండి 100 ఫీట్ల వెడల్పు తో తారు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నారని మరియు సర్వేనెంబర్ 199, 200 లో ఏర్పాటు చేసిన హెూటల్ నిర్మాణం కొంత దేవాలయ భూమిని ఆక్రమించి నిర్మాణం చేసిరని నవంబర్ 4 2024 రోజున నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి తో పాటు దేవాదాయ అధికారులకు పలుమార్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు గురువారం రోజున నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి మరియు దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్, ఈవో నాగిరెడ్డి, ఇన్చార్జి తాసిల్దార్ విజయ, ఆర్ ఐ అమరేందర్ రెడ్డి కలిసి ఆర్డీవో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పది రోజులో ఫిర్యాదుదారులతో పాటు దేవాలయ భూములకు నాలుగు వైపులా ఉన్న రైతులకు నోటీసులు అందించి నాలుగు దిక్కుల సరిహద్దులు ఏర్పాటుచేసి హెచ్చరిక బోర్డులను కూడా పెడతామని అన్నారు .అక్రమ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్ మాదిగ, పెద్ద కాపర్తి మాజీ ఉపసర్పంచ్ పొట్లపల్లి చిన్న స్వామి గౌడ్, ఏర్పుల యాదయ్య, మాచర్ల యాదగిరి, పొట్ల పెల్లి చిన్న లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల మృతికి కారణమైన కెమికల్ కంపెనీ పై చర్యలు తీసుకుంటాం

**చిట్యాల : (నవంబర్ 6) అక్షర కలం,**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ పరిధిలో గల ఫ్యూజన్ లాబరేటరీస్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జివి రమేష్, నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి అన్నారు. గత నెలలో పిట్టంపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపర్ల కు చెందిన గొర్రెలు ఫ్యూజియం లేబరేటరీస్ కంపెనీ ద్వారా వెలువడిన విష పదార్థాలను పిట్టంపల్లి పరిసర ప్రాంతంలో వదిలేసి వెళ్లడం మూలంగా గ్రామానికి చెందిన గొర్రెలు వాటిని తిని మృత్యువాత పడగా దానిపై జిల్లా కలెక్టర్ కమిటీ వేసి విచారించాల్సిందిగా ఆదేశించడంతో పశుసంవర్ధక శాఖ జెడి జీవీ రమేష్ ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు గురువారం పిట్టంపల్లి గ్రామాన్ని సందర్శించి బాధిత గొర్రెల కాపరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వారు పీఠంపల్లి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా కెమికల్ పదార్థాలను వదిలి వెళ్ళడంతో గొర్రెలు తిని 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయని దీనివల్ల గొర్రెలు కాపర్లు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని తెలిపారు. ఇట్టి విషయంపై నష్టపోయిన గొర్రెల కాపరులకు నష్టపరిహారాన్ని ఇప్పించే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేక కమిటీ వేయడం జరిగిందన్నారు. కంపెనీ విషపదార్థాలు తిని సుమారు 30 గొర్రెలు మృత్యువాత పడడంతో వెటర్నరీ సిబ్బందితో మృత్యువాత పడ్డ గొర్రెలకు అయ్యే నష్టపరిహారాన్ని అంచనా వేశారు. మొత్తం 30 గొర్రెలకు గాను 6 లక్షల 30 వేల రూపాయలు నష్టపరిహారాన్ని ఇప్పించేలా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులకు ఆదేశించారు. అంతేకాకుండా సంబంధిత కంపెనీ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి చర్యలకు పాల్పడిన కంపెనీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునే విధంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు అన్ని కంపెనీలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, చిట్యాల ఇంచార్జి తహసిల్దార్ విజయ, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈ.ఈ వెంకన్న, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యాన్ని దించుకోవడంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించొద్దు : కలెక్టర్ ఇలా త్రిపాటి

**చిట్యాల : (నవంబర్ 6) అక్షర కలం,**

వానకాలం పండించిన ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.గురువారం ఆమె నల్గొండ జిల్లా ,చిట్యాల మండలం, వట్టిమర్తి గ్రామంలో ఉన్న సిద్ధార్థ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్ కు వచ్చే దాన్యం వివరాలను పరిశీలించారు.





ఇప్పటివరకు ఎన్ని లారీలు వచ్చాయని , తేమశాతం, ఇతర నాణ్యత ప్రమాణాల వివరాలను యాజమాన్యం ద్వారా అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా గడిచిన వారం, పది రోజుల్లో దాన్యం రైస్ మిల్లులకు రాలేదని, ప్రస్తుతం వర్షాలు లేనందున, మిల్లులకు దాన్యం వస్తున్నదని ,అందువల్ల వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు ఆన్ లోడ్ చేసుకునే విధంగా రైస్ మిల్లర్లు రైతులకు సహకరించాలని కోరారు.ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ముఖ్యంగా స్థలం, హమాలీలను సంసిద్ధంగా ఉంచుకొన్నట్లైతే తెచ్చిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులలో దించుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ధాన్యాన్ని దించుకోవడంలో ఆలస్యం చేయవద్దని, ఒకవేళ వర్షం వస్తే మళ్ళీ తడిచిపోయేందుకు అవకాశం ఉందని ఆమె తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్ ,పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తదితరులు పాల్గొన్నారు

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

కొనసాగుతున్న డిగ్రీ విద్య సంస్థల బంద్



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 06:**

గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలని జిల్లాలోని డిగ్రీ కళాశాలల యాజమాన్య సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫతి) ఆధ్వర్యంలో నవంబర్ 3 నుండి నిర్వహిస్తున్న నిరవధిక బంద్ గురువారం సైతం జిల్లాలో కొనసాగింది. ఈ సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సభ్యులు గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారికి బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలల యజమానుల ప్రతినిధులు మాట్లాడుతూ, స్కాలర్షిప్ నిధులు రాకపోవడంతో విద్య సంస్థలు నిర్వహించడం చాలా కష్టమవుతుందని తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, విద్య సంస్థల భవనాలకు అద్దెలు చెల్లించలేని పరిస్థితిలో నిరవధిక బంద్ చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం విద్యాసంస్థలకు రావాల్సిన నాలుగు సంవత్సరాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, సివి రామన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గడిపల్లి నర్సయ్య, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్వి రమణ, వివిడిసి కళాశాల కరస్పాండెంట్ ఉదారి చంద్రమోహన్ గౌడ్, ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్, వాగ్దేవి డిగ్రీ కళాశాల డైరెక్టర్ శ్రీకర్, మిమ్స్ కళాశాల డైరెక్టర్ శ్రీధర్ రావు, శ్రీ హర్ష డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# శిశు విక్రయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ంరాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు చందన, సరిత

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

నల్గొండ జిల్లాలో శిశువిక్రయాలు,బాల్యవివాహాల వంటివి జరగకుండా ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కల్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జి.చందన, జి.సరిత లు చెప్పారు. గురువారం ఉదయాదిత్య భవన్ లో మహిళా, శిశు సంక్షేమ, సంక్షేమ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూజిల్లాలో పాఠశాలలు,అంగన్ వాడీ, శిశు సంరక్షణ కేంద్రాలు సందర్శించి పిల్లల సంక్షేమం, భద్రత, విద్యా సదుపాయాలు ఆరోగ్య పరిరక్షణపై క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టి శిశు విక్రయాలు, బాల్యవివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. పిల్లలు విద్య పట్ల ఆకర్షితులై చదువుకుంటే జీవితం బాగుంటుందనెలా వారిని ప్రోత్సహించాలని చెప్పారు.పిల్లల భద్రతపై పాఠశాల స్థాయిలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.




పాఠశాలల్లో శానిటేషన్, తాగునీరు, మూత్రశాలలు శుభ్రంగా ఉంచుకోవాలని, అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని, వారిని సొంత బిడ్డలా కాపాడుకోవాలని అన్నారు. ప్రభుత్వం నుంచి అందించే ప్రతిరూపాయ చివరి పిల్లవాడి వరకు అందే విధంగా చూడాలని కోరారు. జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, గృహ నిర్మాణ శాఖ పీడీ,బి సి సంక్షేమ అధికారి రాజ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, డిటిడిఓ చత్రు నాయక్, ట్రైబల్ ఆర్సిఓ. బలరాం, డిసిపిఓ గణేష్, ఎంఈఓ లు, అంగన్వాడి టీచర్లు, హాజరయ్యారు.



# చదువుల పండగ- కలలు కనేద్దాం, నేర్చుకుందాం, సాధిద్దాం, ప్రత్యేక విద్యా కార్యక్రమాల గోడ పత్రిక విడుదల.



**అక్షర కలం/ నారాయణపేట జిల్లా ప్రతినిధి,నవంబర్: 06.**

చదువుల పండుగ పిల్లలను ఆత్మవిశ్వాసం ఆలోచన శక్తి పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. గురువారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విద్యార్థులలో నేర్చుకునే ఉత్సాహాన్ని పెంపొందించేందుకు చదువుల పండగ కలలు కనేద్దాం నేర్చుకుందాం సాధిద్దాం అనే ప్రత్యేక విద్యా కార్యక్రమాల గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుల పండగ పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని సంభాషణ నైపుణ్యాలు పెంపొందించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రీడ్ ఏ తాన్, స్పార్క్ (స్పెల్లింగ్ అండ్ క్విజ్), మనీ మంత్ర, స్పేస్ అవర్, టీ మేకర్ స్పేస్ అండ్ ఏటీఎం ల్యాబ్, వేదిక్ మ్యాస్, ఫ్యూచర్ డాట్స్ కెరీర్ గైడెన్స్, యంగ్ ఒరేటర్ క్లబ్ ఒంటి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. డీఈఓ గోవిందరాజు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులందరికీ ఈ కార్యక్రమాలపై అవగాహన కలగాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో ఈనెల 10 నాటికి క్విజ్ స్పెల్ బి రీడింగ్ పోటీలు నిర్వహించి మండల స్థాయిలో ఈ నెల 11న ఫైనల్ పూర్తి చేయాలని ఎంఈఓ లకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు...

# బేకరీ పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి..




**అక్షర కలం నాగార్జునసాగర్..**

నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రక్కనే ఉన్న మణికంఠ బేకరీపై గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి శాంపిల్ సేకరణ జరిపారు. నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు నల్గొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శివ శంకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేకరీ నిర్వహిస్తున్న యజమాని ఇంట్లో కాలపరిమితి దాటిన ముడి పదార్థాలను వినియోగి స్తున్నట్లు గుర్తించామన్నారు. ఫంగస్ పట్టిన పదార్థాలు పాడైపోయిన గ్రుడ్లు,హానికారక రంగులను వినియోగిస్తున్నారని, ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని ఆయన తెలిపారు. ప్రక్కనే గురుకుల పాఠశాల ఉండటంతో విద్యార్థుల అరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని ఈ విషయంలో విద్యార్థులు జాగ్రత్త వహించాలని వాటి జోలికి పోవద్దని , నిబంధనలు పాటించని మణికంఠ బేకరీకి నోటీసులు జారీ చేసి నెల రోజులు సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.

# నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

**తాడ్వాయి నవంబర్ 6 అక్షర కలం**

తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం, మేడారం తుడుం దెబ్బ గ్రామ కమిటీ, మేడారం పంట నష్టపరిహార సాధన సమితి ఆధ్వర్యంలో దుగ్గి చిరంజీవి అధ్యక్షతన ఐటీడీఏ క్యాంప్ ఆఫీసు నుంచి ర్యాలీ నిర్వహించారు.మేడారం గద్దెల ముందు నష్టపరిహారం చెల్లించాలని ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య, ములుగు జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ మాట్లాడుతూ మేడారం జాతర సందర్భంగా



రెండవ పంట వేసుకోవద్దని అధికారులు ప్రభుత్వం రైతులకు చెబుతున్నారు గాని నష్టపరిహారం మాత్రం ఇవ్వడం లేదు, పంట నష్టపోయే ప్రతి రైతుకు ప్రతి ఎకరానికి నిర్దిష్టంగా శాశ్వత తరహాలో నష్టపరిహారం ఇవ్వాలని మేడారం జాతరలో శాశ్వత బస్టాండ్ ను ఏర్పాటు చేయాలని, రోడ్డు వెడల్పు కారణంగా నష్టపోతున్న చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని,మేడారంలో 24 గంటల వైద్య సదుపాయం అందించాలని జాతర తర్వాత కూడా రద్దీగా ఉండే ప్రాంతాలలో శాశ్వతమైన టాయిలెట్స్ నిర్మించాలని అదేవిధంగా చుట్టుపక్కన ఉన్న గ్రామాలలో కూడా అభివృద్ధి చేయాలని, తాత్కాలికమైన పనులు నాసిరకమైన పనులు కాకుండా శాశ్వతమైన నాణ్యమైన పనులు చేయాలని మేడారం జాతరకు 300 కోట్లు కేటాయించాలని, జాతర తర్వాత పారిశుద్ధ్య పనులు సత్వరతగా చేయాలని అని అన్నారు ప్రతి సంవత్సరం జాతరకు వందల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ శాశ్వతమైన పనులు మాత్రం చేయకుండా నాసిరకమైన పనులు చేసి కాంట్రాక్టర్లు డబ్బులు సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారు అని మండిపడ్డారు,

అక్షర కలం
తెలుగు దినపత్రిక



## భక్తిశ్రద్ధలతో పోచమ్మకు బోనాల సమర్పణ

వైభవోపేతంగా పోచమ్మ ఆలయ పున ప్రతిష్ట



అక్షర కలం, మందమర్రి నవంబర్ 06:

మండలంలోని అందుగుల పేట గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయ పునః ప్రతిష్ట మహోత్సవాలు గత 5 రోజులుగా అత్యంత వైభవోపేతంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. పునః ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం అమ్మవారికి గ్రామస్తులు అంగరంగ వైభవంగా బోనాల మహోత్సవాన్ని నిర్వహించారు. గ్రామస్తులంతా తమ ఇండ్ల నుండి అత్యంత బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జ్ కదారి జీవన్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలు పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని పోచమ్మ తల్లిని కోరుతూ, గత ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. చివరి రోజు గ్రామస్తుల సహకారంతో బోనాల జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కొండపర్తి సందీప్, రామ్మూర్తి, శ్రీనివాస్, మల్లేష్ లు పాల్గొన్నారు.

# బాలల హక్కుల పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
మండల ప్రత్యేక అధికారుల చేత విద్యాసంస్థల పర్యవేక్షణ
ప్రతి కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయనికి ప్రత్యేక అధికారి నియామకం
రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులకు వివరించిన కలెక్టర్

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

నల్గొండ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, వారి విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఇందులో భాగంగానే మండల ప్రత్యేక అధికారుల చేత విద్యాసంస్థలను పర్యవేక్షణ చేయడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేశామని, అలాగే బాలికలకు సంబంధించి ప్రతి కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయకు ఒక ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జి .సరిత జి. చందన నల్గొండ జిల్లాలో అంగన్వాడి కేంద్రాలు,



పాఠశాలలు, కేజీబీవీ ల ద్వారా అందిస్తున్న విద్య, పౌష్టికాహార పంపిణీ, మధ్యాహ్న భోజనం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలెక్టర్ ఛాంబర్ లో కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికి మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో అమలు చేస్తున్న విద్య, అంగన్వాడీలు, పౌష్టికాహారం, ప్రత్యేకించి బాలికలకు సంబంధించిన అంశాలపై మాట్లాడారు. ప్రతి గురువారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యాధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యమైన విద్యతో పాటు, భోజనాన్ని అందిస్తున్నామని, ఇందుకుగాను ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. మండల ప్రత్యేక అధికారులు పాఠశాలల పర్యవేక్షణ చేస్తున్నారని, దీనివల్ల విద్యా వ్యవస్థ బలోపేతమైందని కలెక్టర్ వెల్లడించారు. శిశు గృహ పై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలో నల్గొండ జిల్లా కేంద్రంలో మాత్రమే శిశు గృహ ఉందని, నియమ, నిబంధనల ప్రకారం దత్తత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో చిన్న పిల్లల విక్రయం, బాల్యవివాహాల నిర్మూలన,పిల్లల దత్తత తదితర కార్యక్రమాల నిర్మూలనకు గ్రామీణ ప్రాంతాలలో ఇదివరకే అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని సభ్యులకు వివరించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సరిత, చందన లు మాట్లాడుతూ జిల్లాలో శిశు విక్రయాలు, బాల్య వివాహాలు జరగకుండా, ఏదైనా కొత్త కార్యక్రమాన్ని చేపట్టాలని, ఇందుకు ప్రజలలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం అందించడం, అన్ని పాఠశాలల్లో టాయిలెట్లు ఉండేలా చూడడం, నైట్ వాచ్మెన్లను నియమించడం వంటి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలి.

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



వెంకటాపూర్ నవంబర్ 6 ( అక్షర కలం )

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలనిజిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు.గురువారం వెంకటాపూర్ మండలములోని లక్ష్మీదేవిపేట గ్రామము నందు గల ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో వెన్నెల గ్రామైక్య మహిళా సంఘం ద్వారా నడుపుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, దళారులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయవద్దని, ఎప్పటికప్పుడు ట్యాబ్ నందు రైతుల వివరాలు నమోదు చేసి మద్దతు ధర, బోనస్ ఎప్పటికప్పుడు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాప్యం చేసినచో తక్షణమే చర్య తీసుకోవడం జరుగుతోందని ఆదేశించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తేమ శాతం చూసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ పౌరసరఫరాలు బి రాంపతి, తహసీల్దార్ గిరిబాబు, ఆర్ఐ సుధాకర్, ఏ ఈ ఓ దయానా, ఏపీఎం ధర్మేందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, ములుగు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సేద సారంగం,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టెకోళ్ల వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండ తిరుపతి,మాజీ ఎంపీటీసీ బానోత్ భాస్కర్, నక్క సదయ్య,నాయకులు వీరగాని సాంబయ్య, అజ్మీర హరీష్ ,తండ రమేష్,అంతటి రాము ,ముడిగే రాజకుమార్, ఎంబటి సదయ్య, సి సి లు శేరి ఐలయ్య, సమ్మక్క, వెన్నెల గ్రామక్య సంఘం అధ్యక్షురాలు కొత్తపెల్లి శ్రావణి ,కొనుగోలు సెంటర్ ఇన్చార్జి చిర్ర స్వర్ణలత, సంఘ నాయకులు జాడి రమ, కుమ్మరి లత, వీరగాని రమాదేవి ,కందికొండ అన్నపూర్ణ, బుక్ కీపర్ గుండ్ల రమేష్ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు...

- ఇందిరమ్మ ఇండ్ల కార్యదర్శి వి.పి గౌతమ్....

మెదక్, నవంబర్ 06( అక్షర కలం):-

గురువారం మెదక్ జిల్లా లోని నర్సాపూర్ నియోజకవర్గంలో నీ పెద్ద చింతకుంట , కౌల్చారం మండలంలోని రాంపూర్, కౌడిపల్లి మండలంలోని ధర్మసాగర్, మెదక్ మండలంలోని మాచవరం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరు పై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టరేట్లోని ప్రజావాణి హాల్లో సమీక్షించారు. ఈ సందర్భంగా హౌసింగ్



కార్యదర్శి వి,పి గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మార్కౌట్ (హౌస్ సైట్ మార్కింగ్) పనులు వంద శాతం పూర్తి చేయాలని, ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టివ్వాలనే లక్ష్యంతో అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ప్రతి అర్హత గల కుటుంబం త్వరితగతిన తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. ఇంకా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టని వారికి వారం రోజులు గడివిచ్చారు. వారం రోజుల తర్వాత కూడా ఇందిరమ్మ నిర్మాణం మొదలు పెట్టని యెడల లబ్ధిదారుల స్థానంలో వేరే లబ్ధిదారులకు కేటాయించే విధంగా చూడాలన్నారు. ఎంపిడిఓ లుతమ తమ మండలాల్లో పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి ని ఎప్పటికప్పుడు నివేదిక సమర్పించాలని ఆన్నారు. ఇంజనీరింగ్ అధికారులు, గృహనిర్మాణ శాఖ,మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మార్కౌట్ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించిన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.అదేవిధంగా, మార్కౌట్ పూర్తి చేసిన గ్రామాల వివరాలు ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని, వంద శాతం లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా ప్రత్యేక మానిటరింగ్ బృందాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. పేదలకు సొంత గృహం కల స్వప్నం సాకారం అవుతుందని ఈ సందర్భంగా తెలిపారు.లబ్దిదారులు ఇళ్ల నిర్మించుకునే సమయంలో ఇబ్బందులు తలెత్తితే నిర్మాణానికి అవసరమైన నిధులను మహిళా సంఘాల (స్వయం సహాయక సంఘాలు) ద్వారా లోన్ రూపంలో లబ్ధిదారులకు అందించాలని, గ్రామీణ మహిళల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందన్నారు .

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి: ఎస్సై రమేష్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:




సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఖమ్మం టూ టౌన్ ఎస్ఐ రమేష్ అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో సైబర్ నేరాలపై ప్రజలకు, క్రీడాకారులకు, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అభివృద్ధి చెందుతున్న సాంకేతికతతో పాటు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాల్లో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమన్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏ పోలీస్ అధికారి నేరుగా వాట్సప్ వీడియోకాల్స్ చేయరని, డిజిటల్ అరెస్టులు అని ఎవరైనా కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారిందన్నారు. మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని అన్నారు. అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణమే 1930లో ఫిర్యాదు చేయాలన్నారు.

## పోరు వీరుని చరిత్రకు అక్షర రూపం.. తమ్మినేని వీరభద్రం

అక్షర కలం/ భద్రాచలం

ఆదివాసి బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం బూడిద భూస్వామి పెట్టుబడి దారి దోపిడీ నుండి బలహీన వర్గ ప్రజలను రక్షించేందుకు ఉద్యమ పాఠాలు నేర్పించి పోరాటాల బాటలో నడిపించి భద్రాచలం ఏజెన్సీలో విప్లవ పునాదులను నిర్మించిన బత్తుల భీష్మారావు పోరాట చరిత్రను ఆయన సతీమణి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు హైమావతి అక్షర రూపాన్ని ఇవ్వటం అభినందనీయమని సాహసోపేతంగా జీవించిన వారే వీరోచిత మరణం పొందుతారు అనటానికి బండారు చంద్రరావు భీష్మారావ్ శ్యామల వెంకట్ రెడ్డి వంటి నాయకులే ప్రత్యక్ష నిదర్శనం అని సిపిఐ ఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. భీష్మ రావు నలభైవ వర్ధంతి సభ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ పొందొమ్మిది వందల ఎనభై ఐదు నవంబర్ ఐదు న విప్లవం కోసం పనిచేసే భీష్మ రావు చంద్రరావుని అత్యంత కిరాతకంగా హత్య చేసి విప్లవానికి పుట్టిన వికృత శిశువులు అని పీపుల్స్ వారు మరోసారి రుజువు చేశారని




తమ్మినేని తీవ్రంగా విమర్శించారు. నాటి నుండి నేటి వరకు కమ్యూనిస్టు నాయకులపై నిర్బంధాలు దాడులు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఇన్ని నిర్బంధాలు ఎదురైనా ఎంతమంది నాయకులను హతమార్చిన ఈ దేశానికి ప్రత్యాయం కమ్యూనిస్టులేనని అన్నారు. రోజురోజుకీ పెరుగుతున్న మతోన్మాదానికి కమ్యూనిజం పరిష్కారం అని అని తమ్మినేని స్పష్టం చేశారు. అధికారం కోసం బిజెపి ఎంతకైనా దిగజారుతుంది అనటానికి ఎమ్మెల్యేలను ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం నుండి చివరికి ఓటర్లను మాయం చేస్తే స్థితికి దిగజారారని బీహార్ లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో అరవై నాలుగు లక్షల ఓట్లను చోరీ చేశారంటే బిజెపి రాజకీయ దిగజారుతనం ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని అన్నారు. అధికారం కోసం కావలసిన అడ్డదారులన్నీ తొక్కే బిజెపిని నివారించేందుకే ఇండియా బ్లాక్ ని ఏర్పాటు చేశామని



అన్నారు. అమరవీరుల పోరాట చరిత్రను అధ్యయనం చేస్తూ వారి త్యాగాలను స్మరించుకుంటూ పార్టీని అభివృద్ధి చేయడమే మన ముందు ఉన్న తక్షణ కర్తవ్యం అని తమ్మినేని ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హత్యా రాజకీయాలతో ప్రజా పోరాటాలను ఆపలేరు...

## తక్షణమే భవనం నిర్మించాలి ..జి ఎస్ పి



అక్షర కలం /భద్రాచలం

చర్ల మండలం గురువారం నాడు కొయ్యూరు పంచాయతీ పరిలోగల రామంజపురం గ్రామంలో గోండ్వా నా సంక్షేమ పరిషత్ బృందం గ్రామ ఆదివాసులతో కలిసి పనికిరాని క్రీడామైదానం ను పరిశీలించారు ఆ ప్రదేశంలో తక్షణమే రామంజపురం అంగన్వాడి సెంటర్ కోసం పక్క భవనమును నిర్మించాలని అలాగే జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేయాలని ఆ సెంటర్లో ఇప్పటివరకు అంగనవాడి టీచర్ లేకుండా ఒక ఆయాతోటే ఒక పూరిగుడిసెలో సెంటర్ ను నడిపిస్తున్నారని అన్నారు. కొయ్యూరు గ్రామంలో కూడా స్థలం ఉన్నప్పటికీ అధికారులు ఆ స్థలమును పరిశీలించకుండా ఒక ఇంటిలో అద్దె భవనంలో ఏర్పాటు చేసినారు. కానీ అక్కడ అంగన్వాడి టీచర్ లేకపోవడం మూలంగా పిల్లల బాగోగులనుఎవరుపట్టించుకోవడంలేదనిపిల్లలకుపౌష్టికఆహారంమరియుబాలింతలకు పౌష్టిక ఆహారం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే ఈ రెండు గ్రామాలలోఅర్హులైన ఆదివాసులతో అంగన్వాడి టీచర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసి నాయకులు. పూణేం వరప్రసాద్, ఇర్పా ప్రకాష్, ఎలగల విజయలక్ష్మి, ఎలగల పుష్ప, కనితి రాజు, కనితి రవి పాల్గొన్నారు..

## సాయి బాబా ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

ముఖ్య అతిథిగా పొదెం వీరయ్య

అక్షర కలం /భద్రాచలం

భద్రాచలం సాయి బాబా ఆలయంలో బుధవారం రోజున కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడ్డాయిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ



అధ్యక్షులు పొదెం వీరయ్య సతీసమేతంగా హాజరయ్యారుఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చక బృందం మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పొదెం వీరయ్య స్వయంగా మహా శివుడికి పాలాభిషేకం చేసి, మహాజ్యోతి వెలిగించారుకార్యక్రమంలో పాల్గొన్న భక్తులు కార్తీక దీపాలను వెలిగిస్తూ భక్తి పరవశంలో మునిగిపోయారు. ఆలయ పరిసరాలు భజనలతో, సాయిబాబా స్తోత్రాలతో మార్మోగాయి.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, అర్చకులు మరియు స్థానిక భక్తులు గౌరవ అతిథులకు ధన్యవాదాలు తెలిపారు, గౌరవ అతిథులతో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు సాయిబాబా ఆలయ చైర్మన్ కమ్మనపల్లి ఆదినారాయణ, మరియు వారి కార్యవర్గం తమ్మళ్ల వెంకటేశ్వర్లు, హస్మతుల్లా, వాసిరెడ్డి సాంబశివరావు, కొల్లపూడి వరుణ్, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ ఆగ్రహం

ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు

హైదరాబాద్,

ముస్లింల పట్ల బెదరింపు ధోరణితో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని, అతనిపై చర్య తీసుకోవాలని బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసిన శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, మహ్మద్ షకీల్, బీఆర్ఎస్ నేతలు ప్లలె రవికుమార్, కిశోర్ గౌడ్, సల్మాన్‌ఖాన్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ మైనార్టీ నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలపై జరుగుతున్న దాడులు, ముస్లింలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డిని కోరారు. ముస్లింలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఈవో సుదర్శన్ రెడ్డికి వేర్వేరుగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు, మైనార్టీ నేతలు ఫిర్యాదు చేశారు.

## మండల తహసిల్దార్ కు వినతి పత్రం.

– మాదాసి కురువ, ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు:



**అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి,నవంబర్:06.**

నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో, తెలంగాణ మాదాసి కురువ, మదారి కురువ ఎస్సి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ఉన్నటువంటి కురువగా పిలవబడే మాదాసి కురువలు 64 మండలాల్లో తాహసిల్దార్ కార్యాలయాల దగ్గర మాదాసి కురువ కుల పత్రాలు ఇవ్వడానికి డిమాండ్ చేస్తూ గురువారం మెమొరడం ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మరికల్ మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాలయంలో మాదాసి కురువ జిల్లా కార్యదర్శి గడ్డం తిప్పన్న, కోశాధికారి చిత్తనూరు ఆశప్ప , రాష్ట్ర నాయకులు బండారి మల్లేష్,ఆధ్వర్యంలో, మరికల్ తహసిల్దార్ రామకోటికి మెమొరండం ఇవ్వడం జరిగింది. ఈ విషయమై వారు మాట్లాడుతూ, రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో కొల్లాపూర్ సభలో రెవెన్యూ అధికారులు కలెక్టర్ల సభ వేదిక పైనే ఉన్న సమయంలో మాదాసి కురువలు విద్యలో, వెనుకబడి ఉన్నారని చెప్పారు. జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలి అని ఆకాంక్షను వ్యక్తం చేసిన విషయం అందరికీ తెలిసిందే, అయితే ముఖ్యమంత్రి ఆశయానికి విరుద్ధంగా రెవెన్యూ అధికారులు మౌనం ప్రదర్శించడం ఆందోళనకరమైన విషయం అని, స్పష్టమైన సర్కార్ గజిట్ , ఎస్సీ కమిషన్ మెమో, కోర్టు ఆదేశాలు దృష్టిలో ఉంచుకొని, తమకు ఎస్ సి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం తిప్పన్న, కోశాధికారి చిత్తూరు ఆశప్ప, రాష్ట్ర నాయకులు బండారి మల్లేష్ ,మరికల్ మండలం అధ్యక్షులు ఎల్లప్ప, కే. మల్లేష్, నర్వ వెంకటేష్, దండు నరసింహులు, జెబ్బెనుల శీను, దండు రాములు, ఎలిగండ్ల మల్లేష్, తదితరులు ఇట్టి కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# బాల్య వివాహం అనే సామాజిక సమస్యను అదిగమిద్దాం

### శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్.

అక్షర కలం, నారాయణపేట, జిల్లా ప్రతినిధి, నవంబర్,06.

దేశ పౌరుల సామాజిక బాధ్యతగా భావించి, బాల్య వివాహాలు అనే సామాజిక సమస్యను అదిగమించాలని శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్ పిలుపునిచ్చారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రం ఎస్. ఆర్ గార్డెన్ లో పూజారులు, పాస్టర్లు, క్వాజీలు, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, ఫంక్షన్ హాల్ యజమానులు, సౌండ్ సిస్టమ్ యజమానులు, వంట మాస్టర్స్ తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహ



రహిత సమాజం కోసం కృషి చేయాలనీ, నారాయణపేట జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, బాల్య వివాహ రహిత జిల్లాగా మారుద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ ప్రణయ్ కుమార్, సి.ఐ శివ శంకర్, ఎస్.ఐ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ అధికారులు శ్రీలత, నర్సింహులు, జిల్లా బాలల సంరక్షణ అధికారి కరిష్మ, అనిత, తిరుపతయ్య, నర్సిములు,కవిత, అశ్విని, సంతోష,విజయ్ కుమార్, శ్రవణ్ కుమార్,లక్ష్మణ్ నాయక్, బాల్ రాజ్, భారతి, ఏ.వీ.ఏ నరేష్, విజన్ సంస్థ ప్రతినిధులు రవికుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

## మేడారం మహా జాతర ను విజయవంతం చేయాలి

**మేడారం కు నాలుగు వేల ఆర్టీసీ బస్సులు**

**మేడారం లో ఆర్టీసీ పనులు ప్రారంభించిన ఈ డి సొలోమాన్**



**తాడ్వాయి నవంబర్ 6 అక్షర కలం**

ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆదివాసీ గిరిజన జాతరైన మేడారం సమ్మక్క సరళమ్మ జాతర ను విజయవంతం చేయాలనీ కరీంనగర్ ఎగ్జ్యూట్వ్ డైరెక్టర్ పి సొలోమాన్ అన్నారు.ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతర 2026 పనులకు భూమి పూజ చేశారు.ఈ భూమి పూజ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కరీంనగర్ జోన్ పి సోలోమాన్,వరంగల్ రీజినల్ మేనేజర్ డి విజయ భాను డిప్యూటీ రీజినల్ మేనేజర్ మహేష్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె భాను కిరణ్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ రవీంద్ర సింగ్ పాల్గొన్నారు. డిపో మేనేజర్ శ్రీ ఎం రవిచంద్ర పాల్గొన్నారు.మేనేజర్ మాట్లాడుతూ పనులు మేడారం జాతరకు వచ్చే భక్తులకు అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుందని చెప్పారు, భక్తులకు క్యూలైన్లు, త్రాగునీరు,మరుగుదొడ్లు, భక్తులు వేచి ఉండే షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ జాతరకు ఆర్టీసీ సుమారుగా 4000 బస్సులను నడుపుతున్నట్టు కావున భక్తులందరూ ఆర్టీసీ బస్సుల సేవలను భక్తులు ఉపయోగించుకోవాలన్నారు.ప్రైవేటు వాహనాలలో ప్రయాణించే రాదని, ఆర్టీసీ బస్సుల్లో జాతరకు వచ్చి వారు అమ్మవారి గద్దెలకు దగ్గరగా చేరుకుంటారని ఈ సందర్భంగా తెలియజేశారు.అదేవిదంగా ఆర్టీసీ ప్రయాణం సురక్షతమైన ప్రయాణం అన్నారు.

**2024 జాతర లో 16లక్షల 85 వేలు తరలింపు**

గత 2024 జాతర లో 16లక్షల85 వేల భక్తులను తరలించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ లో ప్రయాణం చేసినట్లు వారు అన్నారు.

**2026 జాతర కు 20 లక్షల భక్తులను తరలిస్తాం**

రాబోయే మహా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి 20 లక్షల మందిని భక్తులను ఆర్టీసీ ద్వారా తరలించనున్నట్లు కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలోమన్ తెలిపారు కావున జాతరకు వచ్చే భక్తులు ఆర్టీసీలో ప్రయాణించి సుఖవంతమైన సురక్షితమైన ప్రయాణం ఆర్టిసి ద్వారానే సాధ్యమని అన్నారు.ఈ కార్యక్రమం లోఆర్టీసీ అధికారులు శంకర్, సివిల్ బాబా, సురేష్, కాంట్రాక్టర్ లింగాచారి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్

**చిట్యాల : (నవంబర్ 6) అక్షర కలం,**

నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామం నుంచి మునుగోడు వరకు వెళ్లి రహదారి గుంటలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారాయి.అని డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు నూరు గణేష్ అన్నారు వెలిమినేడు నుండి మునుగోడు కు వెళ్లే రహదారిని డివైఎఫ్ఐ నాయకులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు వెంబడి వెలిమినేడు, పిట్టంపల్లి వద్ద కెమికల్ కంపెనీలు ఉండటంతో అత్యధిక లోడుతో ఈ మార్గం గుండా వాహనాలు వెళ్లడంతో రోడ్డు మొత్తం గుంటలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కొన్ని వేల కోట్లు పెట్టి కంపెనీలు ఏర్పాటు చేసుకొని కంపెనీలకు వెళ్లే వాహనాల ద్వారా రోడ్లు మొత్తం నాశనం అవుతున్న పట్టించుకోని కంపెనీ యాజమాన్యాలు ప్రజలు ఇబ్బంది పడుతున్న చూసి చూడనట్టు వదిలేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని, రోడ్లకు మరమ్మతులు చేయడం లేదని, దీనితోపాటు మరొక రహదారి వేలిమినేడు నుండి చిన్న కాపర్తికి వెళ్లి రహదారి వెంబడి దాదాపుగా 10 కెమికల్ కంపెనీలు ఉన్నాయి ఆ రహదారి కూడా గుంటలు గుంటలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందన్నారు తరచు అనేక ప్రమాదాలు జరుగుతున్న కంపెనీ యజమాన్యాలు కానీ ప్రభుత్వం కానీ పట్టించుకోవడంలేదని అన్నారు ఇప్పటికైనా రహదారులను మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కూరాకుల బాలు గోలి సాయికిరణ్ గోలి సాయి విగ్నేష్ మెరుగు మల్ల సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

ఈ వానకాలం సీజన్లో పండించిన ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్లు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, వట్టిమర్తి గ్రామంలో ఉన్న సిద్ధార్థ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్ కు వచ్చే దాన్యం వివరాలను పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని లారీలు వచ్చాయని? తేమశాతం, ఇతర నాణ్యత ప్రమాణాల వివరాలను యాజమాన్యం ద్వారా అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా గడిచిన వారం, పది రోజుల్లో దాన్యం రైస్ మిల్లులకు రాలేదని, ప్రస్తుతం వర్షాలు లేనందున, తెరిపి ఇచ్చినందున మిల్లులకు దాన్యం వస్తున్నదని, అందువల్ల వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు ఆన్ లోడ్ చేసుకునే విధంగా రైస్ మిల్లర్లు సహకరించాలని కోరారు.ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, ముఖ్యంగా స్థలం, హమాలీలను సంసిద్ధంగా ఉంచుకొన్నట్లైతే తెచ్చిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులలో దించుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ధాన్యాన్ని దించుకోవడంలో ఆలస్యం చేయవద్దని, ఒకవేళ వర్షం వస్తే మళ్ళీ తడిచిపోయేందుకు అవకాశం ఉందని ఆమె తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తదితరులు ఉన్నారు.

## నవంబర్ 7న వందేమాతర గేయం సామూహిక గీతాలాపన

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 06:**



వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నవంబర్ 7వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య ప్రకటనలో తెలిపారు. బంకిం చంద్ర చటర్జీ వందేమాతర గేయ రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిందని, ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల, ఎయిడెడ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలలో సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమ సంబంధిత ఫోటోలు, వివరాలతో అదే రోజు సాయంత్రం ప్రభుత్వానికి సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 06:**

కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం బిసి బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చి, చట్టబద్ధత కల్పించి, బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో బీసీ నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నేతలు, బిసి నాయకుడు డాక్టర్ నీలకంతేశ్వర రావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపిన, లేనిపోని కారణాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిల్లును అడ్డుకుంటుందని ఆరోపించారు. 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు ఉద్యోగ, విద్య, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు కాకుండా అగ్రవర్ణాలు అడ్డుకోవడం చాలా బాధాకరమని తెలిపారు. దేశవ్యాప్తంగా 10 శాతం లేని అగ్రవర్ణాలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆగ మేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా అమలు చేసిన బీసీ సంఘాలుగా ఆందోళన పట్టలేదని గుర్తు చేశారు. 56 శాతంగా ఉన్న బీసీలకు 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా అగ్రవర్ణాలు హైకోర్టు, సుప్రీంకోర్టుకు పోవడం విచారకరమని తెలిపారు. మెజార్టీ ప్రజలుగా ఉన్న బీసీలు సర్పంచులుగా, ఎంపిటిసి లుగా, జడ్పిటిసి లుగా, కార్పొరేటర్లుగా గెలిస్తే ఓర్వలేకనే రిజర్వేషన్లు అడ్డుకుంటున్నారని ఆరోపించారు.



## అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్**



**అక్షర కలం, మందమర్రి నవంబర్ 06:**

ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షరం మాల కార్యక్రమం 2025 – 26 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మకు అక్షరమాల కార్యక్రమం 2025 – 26 అమలుకు సంబంధించి మండల కేంద్రంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని ప్రతి గ్రామంలోని ఇద్దరు ఓబీ లు, ఒక విఓఏ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండలంలో నిరక్షరాస్యులను గుర్తించి, వారికి చదువు నేర్పించుటకు వాలంటీర్ టీచర్స్ ను గుర్తించి, ఉల్లాస్ ఆప్ లో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి, ప్రతి గ్రామ సంఘం నుండి ఇద్దరు ఓబి లకు, విఓఏ లకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సిఆర్పి లచే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని గ్రామస్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఓబి లు, విఓఏ లు తమ గ్రామాలలో వాలంటీర్లను, నిరక్షరాస్యులను సమన్వయపరిచి, అక్షర కేంద్రాలతో వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అంకితభావంతో అందరూ కలిసి విజయవంతం చేసి, జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ పి సతీష్ కుమార్, మండల ఎంపిడిఓ ఎన్ రాజేశ్వర్, మండల విద్యాశాఖాధికారి దత్తు మూర్తి, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత, ఏపీఎం చంద్రశేఖర్, సుమలత, చైతన్య, ఎస్ఈఆర్పి సిఆర్పి లు రజిత, స్వప్న, మహిళా సమాఖ్య కార్యాలయ సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల ఓబి లు, విఓఏ లు పాల్గొన్నారు.

## ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్త వహించాలి

**అమాయకులనే లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాళ్లు**

**బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్**

**పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ జాగరూకత దివాస్**

**అక్షర కలం, మందమర్రి నవంబర్ 06:**

ప్రస్తుత సాంకేతిక యుగంలో యువతరం ఇంటర్నెట్ వాడకంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ జాగరూకత దివాస్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్, మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై, విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, ఇంటర్నెట్ వాడకం, తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు వందమంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ మాట్లాడుతూ, ఇంటర్నెట్ వాడకంలో జాగ్రత్తగా వహించాలని తెలుపుతూ, సైబర్ నేరగాళ్లు అమాయకులను ఎలా లక్ష్యంగా చేస్తున్నారో వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో పంచుకోవాలని సూచించారు. దీంతో అందరికీ సైబర్ మోసాల పట్ల అవగాహన కలుగుతుందని తెలిపారు. సైబర్ నేరగాళ్లు ముఖ్యంగా నాలుగు రకాల మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో స్కాములు చేస్తున్నారని, సులువుగా డబ్బులు సంపాదించవచ్చునని ఆశ చూపించి, మొదటగా చిన్న మొత్తాలను చెల్లించమని కోరి, చివరకు పెద్ద మొత్తంలో మోసం చేస్తున్నారని వివరించారు. డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ గురించి వివరిస్తూ, అపరిచితులు ప్రభుత్వ అధికారులుగా, పోలీసులుగా ఫోన్ చేసి, లీగల్ చిక్కులు లేదా అరెస్టు పేరుతో బెదిరించి, డబ్బులు డిమాండ్ చేస్తారని తెలిపారు. పెట్టుబడి మోసాలను వివరిస్తూ, అనతి కాలంలోనే అధిక రాబడి ఇస్తామని నమ్మించి, నకిలీ క్రిప్టో లేదా షేర్ మార్కెట్ పథకాలలో పెట్టుబడి పెట్టిస్తారని వివరించారు. అదేవిధంగా ఆన్లైన్లో తప్పుడు కస్టమర్ కేర్ నెంబర్ ను వెతికి, మోసగాళ్లకు ఓటిపి లు లేదా వ్యక్తిగత సమాచారం ఇచ్చి, నష్టపోవడం జరుగుతుందన్నారు. అనంతరం మందమర్రి సీఐ కే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు నేటి సమాజంలో ఎక్కువగా జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. అపరిచితుల నుండి వచ్చే లింకులు, కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎట్టి పరిస్థితులను ఎవరితోనూ పంచుకోకూడదన్నారు. పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్ లు మాట్లాడుతూ, విద్యార్థులు డిజిటల్ భద్రతపై మరింత అవగాహన కల్పించారు. ఎలాంటి మోసం జరిగినా ఆలస్యం చేయకుండా తక్షణమే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బీసీ బిల్లు కోసం రాజ్యాంగాన్ని సవరించే వరకు ఉద్యమం

## బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ గా మునాస ప్రసన్నకుమార్

### ఏకగ్రీవంగా ఎన్నుకున్న వివిధ బీసీ కుల సంఘాలు

### ఐక్య ఉద్యమాలతో బీసీ రిజర్వేషన్ల సాధనకు కృషి చేస్త

### బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ ప్రసన్నకుమార్

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

చీలికలు పేలికలుగా ఉన్న వివిధ కుల సంఘాల అందరినీ కలుపుకొని ఐక్య ఉద్యమాలు నిర్మిస్తూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావాలసిన రిజర్వేషన్ల సాధన కోసం కృషి చేస్తానని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునస ప్రసన్న కుమార్ అన్నారు. గురువారం స్థానిక నల్లగొండ పట్టణంలోని గంగపుత్ర భవనంలో జరిగిన బిసి జేఏసీ సన్నాహక సమావేశంలో వివిధ కుల సంఘాలకు సంబంధించిన నాయకులతో సుదీర్ఘంగా చర్చలు జరిపి సమిష్టిగా




అందరు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేసి మునాస ప్రసన్న కుమార్ ని బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ గా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి బరువైన బాధ్యతలు పెట్టిన బీసీ బంధువులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీలలో ఉన్న 112 కులాలకు సంబంధించిన వారందరినీ కలుపుకొని సమిష్టిగా ఉద్యమాలు నిర్మిస్తానని ఐక్యంగా ముందుకు సాగుతామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల అందరినీ కలుపుకొని బహుజన రాజ్యాధికారం దిశగా అవిశ్రాంతంగా పనిచేస్తానని వారన్నారు. ఈ కార్యక్రమంలో గండిచెర్వు వెంకన్న, పందుల సైదులు, ఐతగొని జనార్దన్ గౌడ్, పాల్వాయి రవి, చిలుకరాజు చెన్నయ్య, పుట్ట వెంకన్న, నజీరుద్దీన్, కర్నాటి యాదగిరి, గడ్డం మారయ్య, తలారి యాదగిరి, నర్సింహ, మార్గం సతీష్ కుమార్, నరేందర్, రాజు, అంబటి శివ కుమార్, శ్రీనివాస్ యాదవ్, నాగరాజు గౌడ్, రాజు యాదవ్, సిద్ధార్థ, గడగొజు విజయ్, జీవన్ బాబు, భూతం సతీష్, శంకరయ్య, భరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రారంభమైన జిల్లా స్థాయి క్రీడలు..

### -విద్యార్థి దశ నుండే క్రీడలపై మక్కువ పెంచుకోవాలి..

### - సైబర్ క్రైమ్ పోలీస్ అధికారి శ్రవణ్ కుమార్..

అక్షర కలం నాగార్జునసాగర్..

విద్యార్థి దశ నుండే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని పూర్వ విద్యార్థి సైబర్ క్రైమ్ పోలీస్ అధికారి శ్రవణ్ కుమార్ అన్నారు. నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రవణ్ కుమార్ గురువారం ముందుగా క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆ తరువాత విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి శాంతికపోతాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని క్రీడల వల్ల విద్యార్థులు శారీరిక బలంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడల్లో రాణించిన వారు భవిష్యత్‌లో అన్ని రంగాల్లో రాణిస్తారని, ప్రతి ఒక్క విద్యార్థి






క్రీడలపై మక్కువ పెంచుకుని ముందుకు సాగాలని సూచించారు. జిల్లాస్థాయిలో 16 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడా పోటీలో పాల్గొంటున్నారు గురువారం జరిగిన క్రీడాంశాలలో గెలుపొందిన జట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం విభాగంలో స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం గణేష్ ప్రథమ స్థానంలో నిలవగా. షాట్ పుట్ విభాగంలో ఎస్ ఓ ఈ అనంతారం పాఠశాల జట్టు,లాంగ్ జంప్ విభాగంలో మూసి పాఠశాల జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఇక కబడ్డీ పోటీలో చిలుకూరు, అనంతారం జట్లు పోటీ పడగా అనంతారం జట్టు విజయం సాధించింది. వాలీబాల్ పోటీలో నాగార్జునసాగర్, సూర్యాపేట జట్లు పోటీ పడగా నాగార్జునసాగర్ జట్టు విజయాన్ని అందుకుంది. కోకో క్రీడలో రాజపేట, అవంతీపురం జట్లు పోటీ పడగా రాజపేట జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ సభ్యులు శివాజీ రాజ్, నాట్కో ఫార్మా అధికారి చంద్ర చంద్రశేఖర్, పాఠశాల ఏటీపీ సంతోష్, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు జ్యోతి, అరుణ పి ఈ టి లు నరసింహ, జానకిరామ్, డిప్యూటీ వార్డెన్ అజయ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐదు తరగతులకు ఒక్కడే ఉపాధ్యాయుడు

చిట్యాల : (నవంబర్ 6) అక్షరకలం, ప్రతినిధి

నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని నేరడ గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో టీచర్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నేరడ ప్రాథమిక పాఠశాలలో మొత్తం ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు 27 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండటంచే ఎటువంటి ఇబ్బంది లేకుండా పాఠ్యాంశాలు సాఫీగా సాగిపోయావని మరొక ఉపాధ్యాయుడు పదోన్నతి పై బదిలీ కావడంతో ఒకే ఉపాధ్యాయుడు వీరికి బోధిస్తున్నారు. అన్ని తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో



విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడం లో ఇబ్బందికరంగా మారిందని, విద్యార్థులకు సమయానుగుణం గా పాఠ్యాంశాలు అయిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అంతేకాకుండా ఒకే ఉపాధ్యాయుడు ఉండడం చేత అన్ని తరగతుల విద్యార్థులను ఒకే తరగతిలో కూర్చోబెట్టి బోధించడంతో విద్యార్థులు ఎంతో అవస్థలు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాలకు కావలసిన టీచర్లను నియమించవలసింది గా విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

### తెలంగాణ ఉద్యమ తరహాలోనే బీసీ పోరు

### ఈనెల 24 నుండి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేక చర్చ పెట్టాలి

### అఖిల పక్షంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రధానితో భేటీ కావాలి

### చేయాల్సిన పని కేంద్ర ప్రభుత్వం చేయకుండా మౌనం వయిస్తే బీసీల తిరుగుబాటు తప్పదు

### బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని యధావిధిగా అమలు చేయడానికి ఈ నెలలో ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాలు రాజ్యాంగాన్ని సవరించి బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తేలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, బీసీ జేఏసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాల ముందు బీసీ రిజర్వేషన్లు పెంచడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని ప్రధాన డిమాండ్ తో బీసీ జేఏసీ మౌన దీక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం నలగొండ పట్టణ కేంద్రంలో క్లాక్ టవర్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు బీసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా బీసీల వాటా బిసి లకే రాజ్యాంగబద్ధంగా దక్కాలని



రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో పోరాటాలు చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ %ఎబ% అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ జీవో నెంబర్ 9 ని విడుదల చేసిందని, ఈ జీవోను వ్యతిరేకిస్తూ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కోర్టులను వేదికగా చేసుకుని అడుగడుగునా అడ్డుకుంటున్నారని, బీసీల తినే కంచంలో మన్ను పోసి నోటికాడు ముద్దను గుంజుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచడం ధర్మబద్ధమైనదని, ఎస్సీ, ఎస్టీ అగ్ర కులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు జరిగినప్పుడు బీసీలకు మాత్రమే జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఎందుకు ఉండవని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లకు సాధన కోసం బీసీ జేఏసీ అష్టాంగ ఆందోళన కార్యక్రమాల పేరుతో నవంబర్ 6వ తేదీ నుండి జనవరి చివరివారం వరకు వివిధ దశల్లో దశలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాలని నిర్ణయించిందని అందులో భాగంగానే ఈరోజు రాష్ట్రంలోని 33 జిల్లా, 119 నియోజకవర్గా, మండల కేంద్రాలలో మౌన దీక్షలు చేపట్టడం జరిగిందని, ఈనెల 13వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా పల్లె నుండి పట్నం వరకు బీసీల ధర్మ పోరాట దీక్షలు చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పైన ఒత్తిడి తీసుకువస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీతో భేటీ జరగాలని, ప్రధాని సమయం ఇవ్వకపోతే ప్రధాని ఇంటి ముందే సీఎం బైఠాయించాలని ఆయన కోరారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ మౌనంగా ఉండడం చాలా బాధాకరమని ప్రధానమంత్రి పదవిని ప్రతిపక్షాలు విమర్శించినప్పుడు బీసీ కార్డును ప్రయోగిస్తున్న ప్రధాని మోడీ బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పందించకపోవడం సరైనది కాదన్నారు. ఈనెల 24 నుండి ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ఈ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పై ప్రత్యేక చర్చ పెట్టి, రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు సామాజిక న్యాయం చేయాలని ప్రధాన డిమాండ్ తో వేలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా పార్లమెంటును దిగ్బంధ%శీ% చేస్తామని ఆయన హెచ్చరించారు. బీసీ జేఏసీ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో గల్లి నుండి ఢిల్లీ వరకు బిసి ఉద్యమాన్ని ఉధృతం చేసి తెలంగాణ ఉద్యమ తరహ లోని పోరాటం చేసి బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని జాజుల శ్రీనివాస్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చక్రహరి రామరాజు జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మినారాయణ, జిల్లా అధ్యక్షులు తండు సైదులు గౌడ్, సుంకరి మల్లేష్ గౌడ్, తీర పంకజ్ యాదవ్, పిల్లి రామరాజు, చిలకరాజు చెన్నయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, పన్నాల గోపాల్, బకారం శ్రీనివాస్, గోలి సైదులు, వైద్యుల సత్యనారాయణ, కాసోజు విశ్వనాదం, మిర్యాల యాదగిరి, నేలపట్ల సత్యనారాయణ, సోమ మల్లయ్య, కేసబోయిన శంకర్ ముదిరాజ్, నాకేరేకంటి కాశయ్య గౌడ్, చిక్కుళ్ల రాములు, గుండు వెంకటేశ్వర్లు, ఐతగోని జనార్దన్, కర్నాటి యాదగిరి, పసుపులేటి సీతారాములు, గంజి బిక్షమయ్య నేత, కట్టలోకి దీపేందర్, వాడపల్లి సాయిబాబా, దామోదర్, నల్ల మధుయాదవ్, పుట్ట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలను హరిస్తున్న కల్తీకల్లు

### నారాయణపేట జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్...

అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి నవంబర్,06

నారాయణపేట జిల్లాలోని ధన్వాడ, మరికల్ మండలాల్లో గ్రామ గ్రామాన కల్తీకల్లు జోరుగా కొనసాగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని నారాయణపేట జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్ ఆరోపించారు. గురువారం నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో



ఆయన మాట్లాడుతూ కల్తీ కళ్ళు తయారీలో మరికల్ అడ్డగా మారిందన్నారు. మరికల్ మండల కేంద్రంలోని మాదవరం వెళ్లే రహదారిలో కల్తీకల్లు జోరుగా తయారు చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. ఈ సంవత్సరంలో ఏ ఒక్కరోజు కూడా కల్తీకల్లు పై ఎక్సైజ్ శాఖ అధికారులు పరిశీలించిన దాఖలు లేవని ఆయన ఆరోపించారు. కల్తికల్లు సేవించి వృద్ధులు, మోకాళ్ళ నొప్పులతో ఇబ్బందులకు గురవుతున్న అధికారులు చూసి చూడనట్లు వారిస్తున్నారు. ధన్వాడ , మరికల్ మండలంలో కల్తీకల్లు నివారించకపోతే నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కల్తీకల్లు జోరుగా కొనసాగుతున్న అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా ధన్వాడ, మరికల్ మండలాల్లో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కల్తీకల్లుతో అమాయకుల ప్రాణాలు హరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ధన్వాడ, మరికల్ మండలాల్లోని వివిధ గ్రామాలలో మద్యం జోరుగా కొనసాగుతుందన్నారు. రాయచూర్ కి చెందిన ఒక వ్యక్తి పేట జిల్లా వ్యాప్తంగా కల్లు దుకాణాలను కొనసాగిస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. గ్రామాలలో చిన్న వయసులోనే కల్లుకు బానిసలు అవుతున్నారని ఆయన ఆరోపించారు. కల్తీకల్లు నివారించడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కల్తీకల్లు నివారించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

## కాంగ్రెస్ పార్టీ చెప్పినట్టుగా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు .

### - వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి.

అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ '06.

నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో ఈరోజు ఇందిరమ్మ లబ్ధిదారులకు ముగ్గు వేసిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ఇచ్చినట్టుగా మాట ప్రకారం పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందని అన్నారు, పార్టీలకతీతంగా తెలంగాణ వచ్చిన తర్వాత ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వలేని టిఆర్ఎస్ నాయకులు టిఆర్ఎస్ ప్రభుత్వం ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల విషయం లో రాజకీయం చేస్తున్నారని అన్నారు, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా పేద ప్రజలకు అర్హులు కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు, అలాగే లబ్ధిదారులు కూడా ప్రభుత్వ సూచనల మేరకు ఇల్లు నిర్మించుకోవాలని ఐదు లక్షలు ఎక్కడ ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో డబ్బులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు, కార్యక్రమంలో ఎంపీడీవో సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొనుంగేరి హనుమంతు, మాజీ సర్పంచ్ జయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లక్ష్మారెడ్డి, కోటకొండ గ్రామపంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు యాదగిరి, భీమేష్ బండ కొండ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచందర్, తిరుమలాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్ , పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి- కలెక్టర్ సిక్తా పట్నాయక్

అక్షర కలం,నారాయణపేట జిల్లా ప్రతినిధి : నవంబర్ 06.

జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో అన్ని మండలాల ఎంపీడీవో లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి? వాటిలో ఎన్ని బేస్ మెంట్, రూఫ్, స్లాబ్ దశల్లో ఉన్నాయి ? ఇంతవరకు ఎన్ని పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. మండలాల వారీగా ఎంపిడివోలకు ఇచ్చిన ఇండ్ల నిర్మాణాలలో ఎవరెవరు లక్ష్యం చేరుకున్నారని ఎంపిడివోలను ప్రశ్నించారు. లక్ష్య సాధనలో వెనకబడి ఉన్న నర్వ,




మరికల్, మక్తల్ మండలాల ఎంపిడివోలను కలెక్టర్ వివరణ కోరారు. ఆయా ఎంపిడివోలు ఇసుక, మొరం, వర్షాల కారణంగా ఇండ్ల నిర్మాణాలకు ఆటంకం కలిగిందని తెలపగా, అత్యధికంగా వర్షాలు కురిసిన ఇతర జిల్లాల్లోనే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని, కానీ మన జిల్లాలో ఇలాంటి కారణాలతో నిర్మాణాలు నిలిచి పోయాయని చెప్పడం సరి కాదన్నారు. వారం రోజుల్లో నిర్మాణాలను వేగిరం చేయాలన్నారు. ఇప్పటి వరకు అసలు నిర్మాణాలను మొదలు పెట్టని వారి ఇండ్లను 45 రోజుల కాల పరిమితి నిబంధన ప్రకారం రద్దు చేయాలని కలెక్టర్ చెప్పారు. కొత్తగా వచ్చిన ఎంపిడివోలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం ఇందిరా డైరీ షీప్ ఫామింగ్ స్కీమ్ కింద కొడంగల్ నియోజక వర్గంలోని మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్, కోస్గి మండలాలతో పాటు మద్దూరు, కోస్గి మున్సిపాలిటీ లలో 631 అప్లికేషన్స్ లు వచ్చాయని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం.ఏ రషీద్ కలెక్టర్ కు వివరించారు. వచ్చిన అప్లికేషన్స్ లను ఆయా మండలాల ఎంపీడీవో లు వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవో లు గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఆస్తి పన్నుల వసూళ్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు రోజూ నిర్ణీత సమయంలోపు గ్రామాలకు చేరుకుంటున్నారా ? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే బాల్య వివాహాల నివారణకు సంబంధించి ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని అడిగారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ తీరు మారకుంటే బలమైన పోరాటాలు

### ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్

### అంబేద్కర్ విగ్రహం ముందు కళ్ల గంతల తో నిరసన

### ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద, మధ్యతరగతి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతూ విద్యార్థులను చదువుకు దూరం చేయడం కోసం కంకనం కట్టుకుందని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ మండిపడ్డారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు, పారామెడికల్ బీటెక్, పీజీ కళాశాల




యజమాన్యాలు సమ్మె కళాశాలలో విజిలెన్స్ దాడులు చేస్తున్నారు. తప్ప పేద, మధ్యతరగతి విద్యార్థులు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ మెంట్ విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి చేతులు రావడంలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రైవేట్ కళాశాలలపై కోపంతో పంతాలకు పట్టింపులకు పోయి ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరపకుండా వారి చర్చలు సఫలం కాకుండా ఉంటే పరీక్షల సమయం దగ్గర పడుతున్న సందర్భంలో విద్యార్థులు సిలబస్ కోల్పోయే ప్రమాదం ఉందని, తక్షణమే వారితో చర్చలు జరిపి ప్రభుత్వం ఇస్తానన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి సజావుగా కళాశాలలు తెరిచే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలలో జరిగే డిగ్రీ పరీక్షలు, సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసి విద్యార్థుల జీవితాలతో చేలగాటమాడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులను దృష్టిలో ఉంచుకొని పునరాలోచించేసి స్కాలర్షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అందరిని కూడగట్టి బలమైన సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రియాజ్, టిల్లు, శివశంకర్, వరుణ్, సాయి వెంకట్, మహేష్,ఆరీఫ్, పహద్ సందీప్ పాల్గొన్నారు.


# విడాకులు ఒక అధ్యాయం ముగింపు మాత్రమే

### సఖ్యత వన్-స్టెప్ సెంటర్

### ఫ్యామిలీ కౌన్సిలింగ్- మీడియేషన్ - ఆర్బిట్రేషన్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 06:**

మనిషి జీవితంలో కొన్ని మలుపులు అనుకోకుండా వస్తాయి. ప్రేమ, పెళ్లి, సంబంధాలు- ఇవన్నీ మనసు సంబంధాలతో ముడిపడి ఉంటాయి. ఇవన్నీ ప్రతి బంధం చివరి వరకు సజావుగా సాగదు. కొన్నిసార్లు పరిస్థితులు, అపార్థాలు, లేదా అనివార్య పరిస్థితిల వల్ల విడాకులు అనేది జరగవచ్చు. ప్రేమతో, ఆశతో ప్రారంభమైన జీవితంలో ఒకరోజు విడిపోవలసి వస్తుందని ఎవరూ ఊహించరు. కానీ జీవితమంటేనే మార్పుల సమాహారం. కొన్నిసార్లు ఆ మార్పులు కఠినమైనవిగా అనిపిస్తాయి. అయినప్పటికీ అవి అంతిమం కావు అవి కొత్త ఆరంభానికి దారి తీసే అవకాశాలు.లి విడాకులు అనేది ఒక



సంబంధం. ముగింపు మాత్రమే జీవితం ముగింపు కాదువిడాకుల తర్వాత చాలామందికి ప్రపంచం చీకటిగా అనిపిస్తుంది.సామాజిక ఒత్తిడి, కుటుంబ విమర్శలు, ఒంటరితనం %-% ఇవన్నీ మనసును బరువెక్కిస్తాయి. ఈ బాధను భరించలేక కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. కానీ ఇది మనసు బలహీనత కాదు, తాత్కాలిక ఆవేశం మాత్రమే. జీవితం ఒక్క సంబంధం కంటే పెద్దది.

**కొత్త జీవితానికి ఆరంభం**

విడాకులు ఒక అధ్యాయం ముగింపు మాత్రమే, జీవిత పుస్తకం ముగింపు కాదు. ఇది మనల్ని మనం తిరిగి కనుగొనే సమయం. మనల్ని మనం తిరిగి కనుగొనే అవకాశం. మన విలువ, ప్రతిభ, స్వతంత్రతను మళ్లీ తెలుసుకునే సమయం కూడా. మన ఇష్టాలు, లక్ష్యాలు, మన బలాలు ఏమిటో గుర్తించడానికి ఇది సరైన దశ.కొత్త హాబీలు నేర్చుకోవడం, కొత్త స్నేహితులను కలవడం, ఉద్యోగం లేదా వ్యాపారం మొదలుపెట్టడం ఇవన్నీ మనలో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి.

**ఆత్మ హత్య ఒక క్షణిక నిర్ణయం**

ఆత్మహత్య ఒక క్షణిక నిర్ణయం – కానీ దాని ప్రభావం శాశ్వతంగా ఉంటుంది. మన జీవితానికి అర్థం కేవలం ఒకే సంబంధం తోనే ఉండదు. మన తల్లిదండ్రులు, పిల్లలు, స్నేహితులు, మన కలలు – ఇవన్నీ మన జీవితం భాగాలు. ఒక దారిలో ఎదురైన నొప్పి, బాధ కోసం మొత్తం ప్రయాణాన్ని వదిలేయడం తగదు.

**సహాయం తీసుకోవడంలో తప్పు లేదు**

మానసిక ఒత్తిడి ఎక్కువైనప్పుడు కౌన్సిలర్, సైకాలజిస్టు లేదా విశ్వసనీయమైన వ్యక్తితో మాట్లాడటం చాలా అవసరం. భావాలను మనసులో దాచుకోవడం కంటే పంచుకోవడం ఉత్తమం. సమాజం కూడా ఇలాంటి వ్యక్తులను అర్థం చేసుకోవాలిబీ వారిని విమర్శించడం కాదు, ప్రోత్సహించడం నేర్చుకోవాలి.



**చివరి మాట**

విడాకులు ఒక అధ్యాయం ముగింపు మాత్రమే. జీవితం అనే పుస్తకంలో ఇంకా ఎన్నో పేజీలు మిగిలే ఉన్నాయి. ఆత్మహత్య కాదు %-% కొత్త ఆరంభమే నీ గెలుపు.

**అడ్వకేట్ రాజలింగు**
**మోతె, ట్రైనడ్ మీడియటర్,**
**హై కోర్ట్ ఫర్ ది స్టేట్ ఆఫ్ తెలంగాణ**

### విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కరించకుంటే

# ఆందోళనలు చేపడతాం

### జీయుఈఈయు - సీఐటీయూ ఖమ్మం జిల్లా జనరల్ బాడీలో యూనియన్ నాయకుల పిలుపులో పాల్గొని ప్రసంగించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. ప్రసాద్

### యూనియన్ లోకి బారి చేరికలు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం : విద్యుత్ శాఖ లో అనేక సమస్యలు ఉన్నాయని వీటి ద్వారా ఉద్యోగులు , కార్మికులు క్రింది స్థాయి కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వీటిని తక్షణం పరిష్కరించుకుంటే ఆందోళన చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు



అనుబంధ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలియపరిచినది . బి .పుష్ప రాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో ఖమ్మం జిల్లాలో క్రింది స్థాయి జూనియర్ లైన్మెన్ , జూనియర్ అసిస్టెంట్ పోస్టులు , సబ్ స్టేషన్ లలో ఆపరేటర్ ఖాళీగా ఉన్నాయని దీనిద్వారా పని భారం మిగతా వారిపై పడి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యూనియన్ తెలిపింది . కొత్త గా సబ్ స్టేషన్ నిర్మించే వాటిలో ఉద్యోగులను నియమించలేదని దీని ద్వారా కార్మికులు



ఉద్యోగులు అధిక శ్రమ పడాల్సి వస్తుందని అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని , సెలవులు ఇవ్వకుండా కార్మికుల్ని , ఇబ్బందులకు గురి చేస్తున్నారని కమిటీ ఆరోపించినది . వెంటనే వీటి స్థానంలో నియామకాలు చేపట్టకపోతే ఖమ్మం స్.ఈ ఆఫీస్ ముందు ఆందోళనలు చేయనున్నట్లు కమిటీ తెలిపింది . సంస్థల్లో వెంటనే అన్ని క్యాడర్ల ప్రమోషన్ ఇవ్వాలని కమిటీ డిమాండ్ చేసింది . కిందిస్థాయి కార్మికులకు కనీస వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని , అనేక సంవత్సరాలుగా వీరు పని చేస్తున్నారని , గత ప్రభుత్వాఓ , యాజమాన్యాలు వీరికి తీవ్ర అన్యాయం చేశాయని కావున తక్షణం వీరి సమస్యల పరిష్కరించి , ఉపాధి కల్పించాలని , వారు విద్యుత్తు బిల్ కలెక్టర్లు , అన్మాన్ కార్మికులు , మీటర్ రీడర్లు , ఎస్పీఎం , స్టోర్ , కార్మికుల ఉన్నారని , వీరికి కనీస వేతనాలు 26 వేలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు . ఆర్టిజన్లనే గ్రేడ్ చేంజ్ చేసి వీరిని కన్వర్షన్ చేయాలని , తక్షణం ఖాళీ పోస్టర్లలో వీరిని భర్తీ చేయాలని ఆర్టిజన్ అనే పదం లేకుండా అందరిని సంస్థల్లో విలీనం చేసుకోవాలని కమిటీ విజ్ఞప్తి చేశారు . కొత్తగా సెక్షన్ ఆఫీసులు డివిజన్ ఆఫీసులు , రెవెన్యూ ఆఫీసులు వచ్చాయని వీటికి అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బందిని , అదనపు పోస్టులు మంజూరు చేయలేదని , కాళీ పోస్టులే భర్తీ చేయకుండా కార్మికులని ఇబ్బందులుపెట్టి శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని , తక్షణం అదనపు పోస్టులు సాంక్షన్ ఇవ్వాలని యూనియన్ డిమాండ్ చేశారు . భారీ చేరికలు , యూనియన్ పట్ల పోరాటాల పట్ల ఆకర్షితులై జూనియర్ లైన్మెన్లు మీటర్ రీడర్లు అన్ మేన్ కార్మికులు . బిల్లు కలెక్టర్లు , అనేకమంది యూని యన్ లో చేరారు . వీరికి జిల్లా నాయకులు అధ్యక్షులు పుష్ప రాణి , కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు , వర్కింగ్ ప్రెసిడెంట్ దొడ్డా. వెంకటేశ్వరరావు , ఆర్టిజన్ల నాయకులు గంటా శ్రీనివాసరావు సత్తుపల్లి నాయకులు ఉగ్గం వెంకటేశ్వర్లు , శ్రీనివాసరావు , వైరా నాయకులు రాజేష్ , ఖమ్మం నాయకులు సీతయ్య , సత్యనారాయణ రెడ్డి , కమలాకర్ లు వీరికి యూనియన్ కండవా కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు . వీరి కోసం యూనియన్ బలంగా పోరాడుతుందని రాబోయే రోజులలో శాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల సమస్యల పరిష్కరించే వరకు నిరంతరం పోరాడుతుందని భవిష్యత్తులో జిల్లాలో ఉన్న ఉద్యోగులందర్నీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు పోరాటాలు చేయనున్నట్లు కమిటీ తెలిపింది . ఈ సమావేశంలో, రామయ్య , లాలయ్య , మధు , రామకృష్ణ , వీరయ్య , నరేష్ , మహిళా ప్రతినిధులు , రాధ , సంధ్య తదితరులు పాల్గొన్నారు .

### వెట్ ల్యాండ్ పరిరక్షణతో

# పర్యావరణానికి మేలు....

### అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి

### వెట్ ల్యాండ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్

**అక్షర కలం/ఖమ్మం బ్యూరో:**

వెట్ ల్యాండ్ పరిరక్షణతో పర్యావరణానికి మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి



అన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన వెట్ ల్యాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ తో కలిసి



పాల్గొన్నారు.వెట్ ల్యాండ్ కమిటీ బాధ్యతలు, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కమిటీ సభ్యులకు జిల్లా అటవీ శాఖ అధికారి వివరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ చిత్తడి భూముల (వెట్ ల్యాండ్) సంరక్షణ కోసం 2017 సంవత్సరంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టిందని అన్నారు. వెట్ ల్యాండ్ గుర్తింపు, సంరక్షణ కోసం జిల్లా వెట్ ల్యాండ్ కమిటీని కలెక్టర్ చైర్మన్ గా ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రాథమికంగా నోటిఫై చేసేందుకు రాష్ట్రంలో 11 వేల 468 వెట్ ల్యాండ్ లను గుర్తించడం జరిగిందని, ఖమ్మం జిల్లాలో 467 వెట్ ల్యాండ్ లు 8 వేల 911 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లు తేలిందని అదనపు కలెక్టర్ తెలిపారు. చెరువులు, రిజర్వాయర్, కాల్వల ఫీడర్ చానెల్స్, మత్స్య శాఖ పరిధిలో ఉన్న ప్రణాళిక, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిధిలో ఉన్న సమాచారం పరిగణలోకి తీసుకుంటూ జిల్లాలో ఉన్న చిత్తడి నేలలు ధృవీకరించాలని అన్నారు. చిత్తడి నేలలు గుర్తించడం ద్వారా భూమి యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లో మారదని, రైతులు, భూ యాజమాన్యులు ఎవరు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. చిత్తడి నేలల్లో కొన్ని పరిమితులు మాత్రమే అమలు చేయడం జరుగుతుందని అన్నారు. చెన్నై మహానగరంలో ఇటీవల వచ్చిన భారీ వరదలకు చిత్తడి నేలలు సంరక్షించక పోవడం ప్రధాన కారణమని తేలిందని అన్నారు. చిత్తడి నేలల భూ స్వభావం మార్పు చేయరాదని, పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని, నిర్మాణ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు వేసేందుకు ఉపయోగించవద్దని, శుద్ధి చేయని వ్యర్థాలను విడిచి పెట్టడానికి వీలు లేదని అన్నారు. రాష్ట్రం నుంచి మనకు వచ్చిన సమాచారం మేరకు క్షేత్రస్థాయిలో చిత్తడి నేలల్లో పర్యటించి స్థానిక పరిస్థితులపై నివేదిక సిద్ధం చేసి జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలను 6 నెలల లోపు నోటిఫై చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. చిత్తడి నేలల్లో అనేక రకాల మొక్కలు, పక్షులు, జంతువులు ఆవాసాలను ఏర్పర్చుకుంటాయని అన్నారు. తడి భూములలోకి కాల్వ సహజ ప్రవాహంలో మానవ జోక్యాన్ని గుర్తించాలని, తడి భూములను రక్షించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. చింతకాని మండలం పైలెట్ క్రింద ఎంపిక చేసి ముందస్తుగా చిత్తడి నేలలు గుర్తించి అక్కడ పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అన్నారు. నీటి వనరుల్లో ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ సమీపంలో తడి భూములను గుర్తించాలని అన్నారు. రాబోయే మంగళవారం నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ డి. పుల్లయ్య, డిపిఓ ఆశాలత, జిల్లా మత్స్య శాఖ అధికారి శివ ప్రసాద్, జిల్లా ఇర్రిగేషన్ అధికారి టి. వెంకట్రాం, డిప్యూటీ సిఇఓ కె. నాగపద్మజ, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, ఇర్రిగేషన్ ఇఇ అనన్య, మధిర, వైరా మునిసిపల్ కమిషనర్లు ఏ. సంపత్ కుమార్, యు. గురులింగం, ఖమ్మం నగరపాలక తదితరులు పాల్గొన్నారు.

# విషహారం తిని గొర్రెలు మృతి

### రోధిస్తున్న కాపరులు

### 30 లక్షల నష్టం జరిగిందని ఆవేదన

### ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

### పరిశీలించిన వెటర్నరీ జెడి

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

విషహారం తిని 150కు పైగా గొర్రెలు మృతి చెందిన సంఘటన నల్గొండ జిల్లా వేములపల్లి మండలం సమీపంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే సూర్యాపేట జిల్లా, పెన్ పహాడ్ మండలం, అన్నారం, అనంతరం, దోసపాడు గ్రామాలకు చెందిన ఉప్పునూతల సైదులు, శ్రీరాముల కోటయ్య, శ్రీరాముల గోపాలు, ఆవుల కోటయ్య, ఆవుల వెంకన్న లు తమ గొర్రెలను గత కొన్ని రోజులుగా మండల కేంద్రం సమీపంలో మేపుతున్నారు. కాగా బుధవారం రాత్రి 80 గొర్రెలు, గురువారం 70 గొర్రెలకు పైగా హఠాత్తుగా మృతి





చెందినట్లు తెలిపారు. వాటి మృతితో సుమారు 30 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్టు గొర్రెల కాపరులు వాపోయారు. భారీ సంఖ్యలో గొర్రెలు చనిపోయి లక్షలలో నష్టం వాటిల్లింది. కంటికి రెప్పలా కాపాడుకున్న గొర్రెలు కళ్ళు ఎదిటే చెల్లాచెదురుగా పడిపోయి చనిపోవడంతో గొర్రెల కాపరులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. గొర్రెలు చనిపోవడానికి కారణం విషపు ఆహారం, విషపు నీరు కానీ అయ్యుండొచ్చు అని స్థానిక పశు వైద్యాధికారి అశోక్ తెలిపారు. పోస్టుమార్టం తర్వాత గొర్రెల మృతికి కారణాలు తెలుస్తాయని అన్నారు.

### ల్యాబ్ నుండి రిపోర్టు వచ్చాకే పూర్తి కారణం తెలుస్తుంది....

### డాక్టర్ జివి రమేష్ (పశు సంవర్ధన శాఖ జెడి నల్గొండ)

మండలం కేంద్రం సమీపంలో 150 కి పైగా గొర్రెలు చనిపోవడంతో వెటర్నరీ జెడిఎ డాక్టర్ జివి రమేష్, సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గొర్రెలను చనిపోవడానికి కారణాలను గొర్రెల కాపరులను అడిగి తెలుసుకున్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్ కు పంపారు. విషహారం తినడం వల్లనే గొర్రెలు చనిపోయి ఉండవచ్చని వెటర్నరీ జెడి ప్రాథమిక అంచనాగా తెలియజేశారు. ల్యాబ్ నుంచి రిపోర్ట్ వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు. జెడిఏ వెంట వెటర్నరీ వైద్యులు అశోక్, జ్ఞానేశ్వర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుల్లారా చేతి గుర్తుకు ఓటేసి నవీన్ యాదవ్ ను గెలిపించండి...




కొల్చారం, నవంబర్ 06( అక్షర కలం):-

జూబ్లీ హిల్స్ ఎలక్షన్ ఇంటింటి ప్రచారం ఎంపీ సురేష్ షెట్కర్, మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి మొహియుద్దీన్ లు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు మద్దతుగా ప్రచారం జోరు సాగిస్తున్నారు. ఓ యువకుల్లారా చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ను గెలిపించాలని యువకులకు తెలిపారు.

## అద్భుతమైన ప్రతిభను కనబరిచిన అభినవ్ రామ్

అక్షర కలం చండూరు



చండూరు మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్త గురిజ మహేష్ ప్రత్యేక శిక్షణలో 9వ వార్డు కి చెందిన భూతరాజు నరేష్, శ్రీలత కుమారుడు 10 సంవత్సరాల వయసు గల అభినవ్ రామ్ భారతదేశంలోని రాష్ట్రాల రాజధానులను 17 సెకండ్లలో, ఆసియా ఖండంలోని 49 దేశాల రాజధానులను 38 సెకండ్లలో ఎటువంటి తడబాటు లేకుండా అనర్గళంగా చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త గురిజ మహేష్ అత్యంత ప్రతిభగల విద్యార్థి అభినవ్ రామ్ ఉన్నత చదువులలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి, భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదిగి తన అద్భుతమైన ప్రతిభా పాటవాలతో దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించేలా అద్భుతమైన విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రజా ఉద్యమాలకు తోడ్పాటునందించిన రాములమ్మ

అక్షర కలం/ కారేపల్లి:

చీమలపాడు ప్రాంతంలో జరిగిన పోడు కూలి మహిళ పోరాటాలకు తన జీవితాంతం తోడ్పాటు అందించిన ఉద్యమకారిణి చెవుల రాములమ్మని మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు రమణ కొనియాడారు. బుధవారం చీమలపాడు లో సిపిఎం సీనియర్ నాయకులు రాచ బంటి పుల్లయ్య, అత్తమ్మ చెవుల రాములమ్మ సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెరుగు రమణ మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య నిర్వహించే పోరాటాలలో ప్రముఖ పాత్ర పోషించిన ఘనత ఎర్రజెండా ఉద్యమాలకు చేయూతనిచ్చిన చెవుల రాములమ్మ జీవితం ధన్యమని ఆవిడ పేర్కొన్నారు. రాములమ్మ జీవితాంతం ఉద్యమకారుని గాని జీవించిందని ఆమె జీవితం అందరికీ ఆదర్శమని ఆమె స్ఫూర్తితో ప్రజలు ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలని అప్పుడే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని మెరుగు రమణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు కొండబోయిన ఉమావతి,షేర్ లలితమ్మ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మండల కార్యదర్శి కే నరేంద్ర,డివిజన్ కమిటీ సభ్యులు వజ్జా రామారావు, మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు వల్లబోయిన కొండలరావు అజ్మీర శోభన్ బాబు సీనియర్ నాయకులు రాచబంటి పుల్లయ్య, ఎరుపోతు భద్రయ్య, మన్యం బ్రహ్మయ్య, షేర్ వెంకటేశ్వర్లు, ఎస్ కే సైదులు, కొండం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు






# అవినీతినిపై ఉక్కుపాదం...





- అవినీతి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి....
- కర్మ ఎవరిని వదిలిపెట్టాదు....
- ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులు ప్రభుత్వ ఉద్యోగులు....
- ప్రజల పట్ల జాలి, కరుణా,,,వృత్తి పట్ల నిబద్ధత ఉండాలి....
- ఉద్యోగులందరూ నీతి నియమాలని అనుసరించాలి...
- వివిధ శాఖల్లో పేరుకు పోతున్న అవినీతిని కూకటి వేళ్లతో పెకలించడమే లక్ష్యం...
-పారదర్శక పాలనే లక్ష్యంగా ముందుకు...
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..

మెదక్, నవంబర్ 06 (అక్షర కలం):-

అవినీతిని అంతమొందించి జిల్లాలో పారదర్శకత పాలనే లక్ష్యంగా ముందుకు పోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు పిలుపునిచ్చారు.గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ఎవరైనా అధికారులు,లేదా వాళ్ల సిబ్బంది , అధికారులకు అవినీతి ఆలోచన ఉంటే విరమింప చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జిల్లా అధికారులకు సూచించారు. ప్రజల పట్ల ఉద్యోగులు జాలి కరుణ కలిగి ఉండి వృత్తిపట్ల నిబద్ధతగా ఉండాలన్నారు. పేదలను పీడించే అవినీతి ఉద్యోగుల భరతం పడతామన్నారు. ఉద్యోగులందరూ నీతి నియమాలు అలవర్చుకోవాలని సూచించారు. వీరి శాఖలో పేరుకు పోతున్న అవినీతిని కూకటి వేళ్లతో పెకలించడమే లక్ష్యంగా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు ప్రభుత్వ ఉద్యోగులేనని తెలిపారు. అధికారులందరూ ఏకధాటిగా అవినీతిపై ఉక్కు పాదం మోపాలన్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. అనంతరం అవినీతిపై ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో , జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఏ శ్రీనివాసరావు, జిల్లా రెవెన్యూ అధికారి భుజంగారావు, మెదక్ ఆర్డిఓ రమాదేవి ,అధికారులు, తదితరులు ఉన్నారు.

# తేమ శాతాన్ని తగ్గించేందుకు ధాన్యాన్ని ఆరబెట్టాలి

- సీరియల్ నంబర్ తో సంబంధం లేకుండా కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
- పలు కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ



వర్షాలు తగ్గినందున 17 శాతం తేమ వచ్చే విధంగా రైతులు కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతులకు సూచించారు. సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, ఇందుకుగాను అవసరమైన లారీలు, హమాలీలు, కాంటాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. గురువారం ఆమె నల్గొండ మండలం, జి.చెన్నారం, చర్లపల్లి లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. ముందుగా జి. చెన్నారం వెళ్లిన జిల్లా కలెక్టర్ అక్కడ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు వచ్చిన దాన్యం, తేమ శాతం అన్ని వివరాలను నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు పంపించేందుకు ఎక్కువ లారీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీరియల్ నంబర్ తో సంబంధం లేకుండా సరైన తేమ వచ్చిన అన్ని కుప్పలను కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని అన్నారు. కొనుగోలు చేసి సంచులలో నింపిన ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి ఉంచాలని, ఒకవేళ వర్షం వస్తే తడవకుండా చూడాలని ఆదేశించారు. టార్పాలిన్లు, వేయింగ్ మిషన్స్, వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూమెంట్ రిజిస్టర్ ను, ధాన్యం వచ్చిన రిజిస్టర్లను పరిశీలించారు. లారీల సమస్య, ఇతర ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం కలెక్టర్ చర్లపల్లి లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో ముఖానికి మాట్లాడడమే కాకుండా, సరైన తేమ రావాలంటే ధాన్యాన్ని రాశులుగా పోయకుండా విప్పదీసి ఆరబెట్టాలని చెప్పారు. ఈ కేంద్రంలో తేమశాతం 17 ఉన్న రైతుల ధాన్యం కుప్పలు ఎక్కువగా ఉన్నందున, తక్షణమే ఈరోజే 10 లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు పంపించేలా చూడాలని పవర్సరఫరాల డిఎం గోపికృష్ణను ఆదేశించారు. ప్రతిరోజు ధాన్యం తేమశాతాన్ని పరిశీలించాలని, సరైన తేమ, నాణ్యతా ప్రమాణాలు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ ఇదే మండలం దండెం పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ధాన్యం తేమ, నాణ్యత, తదితర వివరాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, డిఎస్ఓ వెంకటేష్, పౌరసరఫరాల డిఎం గోపికృష్ణ, తహసిల్దార్ పరశురామ్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వం ఆశాలకు ఫిక్స్ వేతనం18 వేలు నిర్ణయించాలి

- నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి
- ఆశాలకు పనిభారం, టార్గెట్స్ తగ్గించాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ



దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫిక్స్18 వేల వేతనం నిర్ణయించి అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు నల్గొండ జిల్లా 5వ మహాసభ సుజాత, సునీత, జయమ్మ ల అధ్యక్ష వర్గంగా జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాల చట్టం 1948 ప్రకారం కనీస వేతనం26 వేల ఇవ్వాల్సి ఉండగా 9,500 పారితోషకాలు మాత్రమే ఇస్తూ ఆశాల శ్రమను ప్రభుత్వాలే దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఆశాలకు ఒకే జాబ్ చార్ట్ ఉండాలని, ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, ఎన్ హెచ్ ఎం స్కీము ను బలోపేతం చేయాలని అనేక ఉద్యమాలు ఆశాలు చేశారని మోడీ ప్రభుత్వం మాత్రం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ ను తెచ్చి కార్మిక వర్గాన్ని మరింత దోపిడీ చేయడానికి అవకాశం ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే 18 వేల ఫిక్స్ వేతనం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆశాలు పనిచేయడం లేదని వాళ్ళు పారితోషకాలు తగ్గించాలని చూస్తున్నారని అదే జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇచ్చిన హామీ అమలు కోసం భవిష్యత్తు లో పోరాడుతామని అన్నారు.జిల్లాలో ఆశా వర్కర్లపై తీవ్రమైన పని భారం పెరిగిందని దీంతోపాటు అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.టీబి స్ఫుటం డబ్బాలు, ఏఎన్ సి టార్గెట్స్, సబ్ సెంటర్ డ్యూటీలు, పల్లె దావకాన లో ఊడ్చే పని, టాయిలెట్ లో నీళ్లు పెట్టడం, ఆన్లైన్ వంటి పనులతో వేధింపులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి మానుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. లెప్రసీ పెండింగ్ బిల్లులు, ఎన్నికల డ్యూటీల డబ్బులు వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి. సలీం, జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, జిల్లా నాయకులు, పి. సైదులు, అవుట రవీందర్, పోలే సత్యనారాయణ, అద్దంకి నరసింహా, ఆశా యూనియన్ నాయకులు రమావత్ కవిత, బి. సౌజన్య, స్వర్ణ, వజ్రమ్మ, ప్రేమలత, జ్యోతి, భాగ్యమ్మ, మణెమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే చోట వేధిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు: షి టీమ్ పోలీసులు

అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ - 06.

ఉట్కూర్: ఉట్కూర్ మండలంలోని విజయ కాటన్ ఇండస్ట్రీస్ వద్ద పనిచేస్తున్న కూలీలకు నారాయణపేట జిల్లా షీ టీమ్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు మాట్లాడుతూ... పని చేసే చోట మహిళలను ఎవరైనా వేధింపులు, అశ్లీల వ్యాఖ్యలు, బెదిరింపులు, అనుచిత ప్రవర్తన చేసినా భయపడకుండా వెంటనే నారాయణపేట షి టీమ్ 8712670398 పోలీసులకు, సమాచారం ఇవ్వాలి అని సూచించారు. మహిళల భద్రత, గౌరవం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీమ్, డయల్ , 112 నంబర్లు ఎప్పుడూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఉద్యోగస్త మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని, వేధింపులు ఎదురైతే న్యాయపరంగా రక్షణ పొందే మార్గాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు జ్యోతి, కవిత ,ప్రజలు, కూలీలు, యువకులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ....





**కొల్చారం, నవంబర్ 06( అక్షర కలం ):-**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎంపీ సురేష్ షేట్కర్, మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మోహి నుద్దీన్ కలిసి గురువారం ఉదయం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ సెట్కర్ మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మోహియుద్దీన్ లు మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో బి ఆర్ఎస్ , బిజెపి పార్టీలు ప్రజలకు ఓర్గబెట్టిందేమీ లేదని వారు తెలిపారు. గత పోయిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వారు గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ప్రజలు పట్టం కడతారని వారు తెలిపారు. ఈ ప్రచారంలో ఎంపీ తో పాటు మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మొ యినుద్దీన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు

# అవగహన కలిగి ఉండాలి

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ సైబర్ జాగరుకత దివాస్ దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు ..





అక్షరకలం నల్లగొండ

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రోజు దేశ వ్యాప్తంగా అనేక మంది సైబర్ నేరగాళ్లు బారిన పడి మోసాలకు గురవుతున్నారనీ,వారి బారిన పడకుండా ప్రతి ఒక్కరికి అవగాహన కల్గిఉండమే ఉత్తమ మార్గం అని జిల్లా ఎస్పీ గారు అన్నారు. సైబర్ జాగారుకత దివాస్ సందర్భంగా నల్లగొండ పట్టణం కేంద్రంలోని దీప్తి నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు, సైబర్ నేరాలపట్ల అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ గారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎక్కువగా సులభంగా మోసపోయేది సైబర్ నేరగాళ్ల ద్వారానే అని అన్నారు.కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. డబ్బుల పోయాక బాధపడటం కంటే అవగాహనా తో వ్యవహరించి జాగ్రత్తగా ఉండాలని అన్నారు. చదువుకున్న విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉంటే తన చుట్టూ పరిసరాల్లో ఉన్న ప్రజలకు,వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తద్వారా సైబర్ మోసాలు నిరోధించవచ్చునని ,సైబర్ నేరగాళు ప్రజలనూ మోసం చేస్తున్న విధానాన్ని కళాశాల విద్యార్థినులకు తెలియజేశారు. ప్రస్తుత కాలం లో జరుగుతున్న నేరాలు అయిన ఏపీకె ఫైల్స్ వాట్సాప్ లో ఫార్వర్డ్ చేస్తున్నారు,ఈ ఏపీకె ఫైల్ ఓపెన్ చేస్తే ఫోన్ హ్యాక్ కు గురి అయి డబ్బులు పోయే అవకాశం ఉంటుంది, అలాగే జంప్డ్ డిపాజిట్ స్కీం, డిజిటల్ అరెస్టు, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, సైబర్ బుల్లింగ్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే బ్యాంక్ అదికారులు ఎవరు కూడా ఫోన్ చేసి ఓటీపీ వివరాలు అడగరు అనే విషయాలను గుర్తించాలని ,బ్యాంక్ వారు ఏలాంటి మెసేజ్ లు గాని, లింక్స్ పంపరని ఇట్టి విషయాలు గమనించి మీ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, ఏమైన సందేహాలు ఉంటే బ్యాంక్ కు వెళ్లి నిర్ధారించుకోవాలి అని అన్నారు. గ్రూప్ లలో లేదా వ్యక్తిగత నెంబర్ లకు అపరిచిత వ్యక్తుల నుండి ఎస్ ఎమ్ ఎస్ ఈ మెయిల్స్ ద్వారా గాని, వాట్సాప్ ట్వీట్టర్ ద్వారా వచ్చే బ్లూ కలర్ లింక్స్ ను క్లిక్ చేసి మోసపోవద్దని, అలా వచ్చే మెసేజ్ లకు స్పందించవద్దనీ తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైన వెంటనే స్పందించి 1930 కి సమాచారం అందించి ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారు. తద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమ%శీ%లో సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ ఎస్బీ సీఐ రాము,1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఐ విష్ణు,మరియు కళాశాల విద్యార్థినులు తదితరులున్నారు.

## సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షర కలం, ఆమనగల్లు :**

ఆమనగల్లు మండలం అకుతోటపల్లి గ్రామ పరిధిలోని ఎన్.డీ.టీ కాటన్ ఇండస్ట్రీస్ లో (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా గురువారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, పల్లె జంగయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. రైతుల ప్రయోజనార్థం ఈ కేంద్రం ద్వారా పత్తిని కనీస మద్దతు ధర (%మీ్రా%) కే కొనుగోలు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా యాట గీత నర్సింహా మాట్లాడుతూ.. రైతులు దళారుల వద్దకు పోకుండా నేరుగా సీసీఐ కేంద్రంలో పత్తిని విక్రయిస్తే నష్టాలు తప్పి, సరైన లాభాలు పొందవచ్చన్నారు.పత్తి నాణ్యతను కాపాడుకుంటూ తేమ శాతం తగ్గిన తరువాతే తేవాలని సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి పత్తి మార్కెట్లలో పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నదని ఆమె తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే అధికారులు స్పందిస్తారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సూపర్ వైజర్ రాజేశ్వరి, సీపీఓ రాజీవ్, మిల్లు యజమాని వంశీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ షఫీ, కుమ్మరి రాములు తదితరులు పాల్గొన్నారు.



## యాంటీ ర్యాగింగ్ పై మెడికల్ కాలేజ్

# విద్యార్థులకు అవగాహన

### టౌన్ ఏసీపీ రమణమూర్తి

**అక్షర కలం/ ఖమ్మం బ్యూరో:**

ర్యాగింగ్ కు పాల్పడి తమ విలువైన జీవితాన్ని అంధకారం చేసుకోవద్దని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు యాంటీ ర్యాగింగ్ చట్టంపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మమత మెడికల్ కాలేజ్ విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సెమినార్ కార్యక్రమానికి హజరైన ఏసీపీ మాట్లాడుతూ.. విద్య వ్యవస్థలో ర్యాగింగ్ పై నిషేధం ఉందని, సీనియర్స్, జూనియర్స్ పట్ల ర్యాగింగ్‌కు పాల్పడం చట్టాన్ని అతిక్రమించినట్లే అవుతుందని అన్నారు.ఎవరైన విద్యార్థులు ర్యాగింగ్ లాంటి వికృత చేష్టలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ చర్యల ద్వారా విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడే




విధంగా వుంటుందని అన్నారు. విద్యార్థులు సహ విద్యార్థులపై ఎటువంటి వేధింపులు, దౌర్జన్యాలు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని ఎవరైన ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపాల్, యాజమాన్యం లేదా పోలీసులకు సమచారం అందించాలని సూచించారు.ర్యాగింగ్ అనేది విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని కావున విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, విధ్యార్థులు పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని పూర్తిగా నిర్మూలించగలుతామని పేర్కొన్నారు.చట్టాన్ని తెలుసుకొని భవిష్యత్‌కు ఎలాంటి



ఇబ్బందులు లేకుండా విద్యాభ్యాసంపై దృష్టిని నిలిపి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని మీ తల్లితండ్రులకు మంచి పేరు తీసుకోరావాలన్నారు. తోటి విద్యార్థినుల పట్ల సోదరభావంతో కలిసిమెలిసి విద్యనుఅభ్యసించాలని,అత్యుత్సాహానికిపోయి జీవితా లను అంధకారం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల్లో మాగంటి సునీతను భారీ మెజారిటీతో

# గెలిపించాలి - మాజీ ఎంపీ నామ

### ఎన్టీఆర్ పేరును ఉపఎన్నికల కోసం వాడుకోవడం సరికాదు

### పార్లమెంట్‌లోనే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేశా

### ఎన్టీఆర్ బాటలో నడిచిన నాయకుడు కేసీఆర్

**అక్షర కలం/ హైదరాబాద్:**

హైదరాబాద్ తెలంగాణ భవన్ లో గురువారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ అభిమాని గోపీనాథ్ అకాల మరణంతో వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గోపీనాథ్ భార్య మాగంటి సునీతకు కేసీఆర్ అవకాశం ఇచ్చారని, మూడు సార్లు గోపీని ఆదరించినట్లే సునీత ను ఆదరించాలని జూబ్లీహిల్స్ ప్రజలను కోరారు. ఈ మీడియా సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కరావు, కోనేరు కోనప్ప తదితరులుతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ చరిత్ర చూసినట్లయితే 1983 నుంచి ఎన్టీఆర్ విధేయుడిగా, నమ్మిన బంటుగా వున్న మాగంటి గోపీనాథ్ ఆయన చివరి శ్వాస వరకు వెంట వున్నారని, నాడు ఎన్టీఆర్ తర్వాత పేదలు, బడుగు బలహీన వర్గాలు కోసం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి మరల కేసీఆర్ వెంట నడిచారన్నారు. పదేళ్లల్లో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో, హైదరాబాద్ లో కనీవిని ఎరగని అభివృద్ధి జరిగిందని, హైదరాబాద్ పట్టణం లో అభివృద్ధి చూసే మొన్నటి ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ ను గెలిపించారన్నారు. నాటి బిఆర్ఎస్ పాలనతో పోల్చి చూస్తే ఇప్పుడు వున్న ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల పాలనలో ఏమి చేయలేకపోయారన్నారు.

### ఎన్టీఆర్ పేరును ఉపఎన్నికల కోసం వాడుకోవడం సరికాదు

ఇప్పుడు కేవలం ఉపఎన్నికలు వచ్చాయని హైదరాబాద్ లో ఎన్టీఆర్ విగ్రహం పెడతామని మాట్లడుతున్నారు వారికి ఎన్టీఆర్ ఇవాళ గుర్తుకు వచ్చారా అని ప్రశ్నించారు? ఒక పెద్ద మనిషి అయితే సత్తుపల్లిలో మూడు సార్లు గెలిచి అక్కడ ఎన్టీఆర్ విగ్రహం కూడా పెట్టలేదని, అదే సత్తుపల్లి లో నేను మాజీ ఎమ్మెల్యే సండ్ర కలిసి మొదటి సారి ఎన్టీఆర్




విగ్రహం పెట్టామన్నారు. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్రం లో ఎక్కడ లేని విధంగా తాను ఎంపీ, పువ్వాడ అజయ్ మంత్రి గా వున్నా సమయం లో ఖమ్మం నడిబొడ్డు లో 60 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని మేము పెట్టాం, ఎన్టీఆర్ చరిత్రను గ్రానైట్ పై రాయించమన్నారు. అయితే ఇప్పుడు ఎన్టీఆర్ చరిత్ర ఉన్న గ్రానైట్ రాళ్లను, లైట్లు తొలిగించారని ఇది చాలా బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఎన్టీఆర్ పేరు వాడుకుంటున్నారని వారికీ నిజంగా చిత్త శుద్ధి ఉంటే వెంటనే ఎన్టీఆర్ విగ్రహానికి తొలగించిన లైట్లు, చరిత్ర రాసిన రాళ్లు ఏర్పాటు చేయాలని నామ డిమాండ్ చేసారు.

### పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేశా -మాజీ ఎంపీ నామ

### జాతి మొత్తం తనవైపే ఉందని చెప్పడం సరికాదు

నామ తాను మొదటి సారి పార్లమెంటరీ పార్టీ నేత గా వున్న పదిహేనవ లోక్ సభ లో పోరాటం చేసి పార్లమెంట్ లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టించడం జరిగిందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ రాజకీయ బిక్ష పెట్టినారు అని మాట్లాడిన వారు ఎన్టీఆర్ ను వీడి చంద్రబాబు నాయుడు దగ్గరకు పోయి, అక్కడ నుండి ఆయనను వదిలి కేసీఆర్ దగ్గరకు పోయి, మరల కేసీఆర్ ను వదిలి పెట్టి రేవంత్ రెడ్డి దగ్గరకు పోయారన్నారు. రాజకీయ అవకాశాల కోసం అన్ని పార్టీలు తిరిగిన వారు రేపు ఏ పార్టీలో ఉంటారో తెలియదు. ఇప్పుడు ఏమో జాతి గురించి మాట్లాడుతూ, సామాజిక వర్గం మొత్తం తనవైపే ఉందని చెప్పడం సరికాదన్నారు.

### రామోజీరావు ఒంటి పై చేయపడకుండా కేసీఆర్ చూసారు

కేసీఆర్ అందర్నీ అక్కున చేర్చుకున్నారని, తాను ఒకసారి కేసీఆర్, హరీష్ రావు దగ్గర వున్నప్పుడు రామోజీ రావును ఇబ్బంది పెట్టడానికి వేరే రాష్ట్రం నుండి కొందరు మఫ్టీలో వచ్చారని తెలిస్తే... కేసీఆర్ అంగీకరించలేదని, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎవరినీ తీసుకు వెళ్ళడానికి వీలులేదని కేసీఆర్ స్పష్టంగా చెప్పారన్నారు. ఆ రోజు మహానుభావుడు రామోజీరావు ఒంటి పై చేయి పడకుండా కేసీఆర్ చేసారని, ఇది నేను కళ్లారా చూసానని నామ తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్, కేటీఆర్ సమయంలో హైదరాబాద్ పట్టణం లో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి వలన చాలా మంది ప్రజలు కరెంట్ కోతలు, నీటి కష్టాలు లేని సురక్షితమైన ప్రదేశం హైదరాబాద్ లో ఉండాలని కోరుకునేవారన్నారు. ఇప్పుడు రెండేళ్ల కాంగ్రెస్ పాలన ఎలా సాగుతుందో అందరమూ చూస్తున్నామన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ప్రజల్లో ఒకడిగా అహర్నిశలు పని చేసిన మాగంటి గోపినాథ్ ను ఏ విధంగా ఆదరించి గెలిపించారో అదే విధంగా మాగంటి సునీతను మంచి మెజారిటీ తో గెలిపించాలన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955